

2లో

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి

జీవితాలను వెలిగించుకోండి

కరీంనగర్ పోలీస్ కమీషనర్ మహ్మద్ గౌస్ ఆలం



కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

శుక్రవారం 10, జులై 2026 16 పేజీలు



జాగ్రత్తలు తీసుకోవాలి

సూపర్ ఎల్‌నినోతో

సూపర్ ఎల్‌నినో ప్రభావంపై విస్తృత అవగాహన కల్పించాలి

సాగునీటి లభ్యత లేని ప్రాంతాల్లో వరి సాగు చేయవద్దు

తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి

మహారాష్ట్ర, కర్ణాటక వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలి

సూపర్ ఎల్‌నినోను పంటల వైవిధ్యీకరణకు అవకాశంగా మలుచుకోవాలి..

2లో

వ్యవసాయం, సాగునీరు, వర్షపాతం పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. సీఎస్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, జలాశయాల్లో నీటి నిల్వలు, ఖరీఫ్ పంటల ప్రణాళికపై రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఏసీబీకి చిక్కిన

పంచాయతీరాజ్ ఏఈ

రూ. 10 వేలు తీసుకుంటుండగా పట్టివేత

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త: ఇందు కలదందు లేడని సందేహం వలదు ఎందెందు వెతికిన అందందు కలదు అవినీతి అన్నట్లుగా తయారైంది ప్రభుత్వ శాఖల పరిస్థితి. ఒకప్పుడు రెవెన్యూ పోలీస్ శాఖ లోనే అవినీతి జరుగుతుందని లెక్కలు చెబుతున్న... ప్రస్తుతం పరిస్థితి మారింది. ప్రతి ప్రభుత్వ శాఖలోనూ అధికారులు అందిన కాడికి దోచుకుంటూ కోట్లకు పడగలెత్తుతున్నారు. రోజుకోచోట అవినీతి అధికారులు పట్టుబడుతున్న పనితీరులో మార్పు రావడం లేదు.



2లో



ఒక మహారాష్ట్ర కూలీ దుర్మరణం!

2లో

అనుపురం ఇస్లాం నగర్ వద్ద

ఘోర రోడ్డు ప్రమాదం..

వేములవాడ అర్బన్ ప్రభాతవార్త : వేములవాడ అర్బన్ మండలం అనుపురంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన అతుల్ (35) వలస కూలీ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మరికొందరి పరిస్థితి అత్యంత విషమంగా వుంది.

ఇద్దరికి సీరియస్..

వరంగల్ తరలింపు

అనుపురం రోడ్డు ప్రమాదంపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి.. ప్రమాద సమయంలో టాటా ఏస్ వాహనంలో 23 మంది బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది: విప్ ఆది శ్రీనివాస్

రామగుండం పవర్ హౌస్‌కు పునర్జన్మ



800 మెగావాట్ల క్రిటికల్ ప్లాంట్ పర్పాటుకు వేగం

పాత యూనిట్ స్థానంలో భారీ విద్యుత్ కేంద్రం

జెన్‌కో-సింగరేణి భాగస్వామ్యానికి కేబినెట్ ఆమోదం

ఎన్‌టీపీసీతో కలిసి ప్రాజెక్టు అమలుపై చర్చలు

ఉపాధి, పారిశ్రామికాభివృద్ధిపై భారీ ఆశలు

గోదావరిఖని ,ప్రభాతవార్త: ఒకప్పుడు తెలంగాణ విద్యుత్ రంగానికి సేవలందించిన రామగుండం థర్మల్ పవర్ హౌస్ మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంటోంది. పాత 62.5 మెగా వాట్ల ప్లాంట్ స్థానంలో అత్యాధునిక సాంకేతికతతో 16లో

సూపర్ ఎల్‌నినోతో

జాగ్రత్తలు తీసుకోవాలి

సూపర్ ఎల్‌నినో ప్రభావంపై విస్తృత అవగాహన కల్పించాలి

సాగునీటి లభ్యత లేని ప్రాంతాల్లో వరి సాగు చేయవద్దు

తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి

మహారాష్ట్ర, కర్ణాటక వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలి

సూపర్ ఎల్‌నినోను పంటల వైవిధ్యీకరణకు అవకాశంగా మలుచుకోవాలి..

వ్యవసాయం, సాగునీరు, వర్షపాతం పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. సీఎస్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, జలాశయాల్లో నీటి నిల్వలు, ఖరీఫ్ పంటల ప్రణాళికపై రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగిత్యాల సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, జూలై 9 నాటికి రాష్ట్రంలో 15 శాతం వర్షపాతం లోటు నమోదైందన్నారు. 14 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 19 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. కృష్ణా బేసిన్‌లో గతేడాదితో పోలిస్తే నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని, ఇప్పటివరకు ఎగువ రాష్ట్రాల నుంచి ఎలాంటి ప్రవాహం రాలేదన్నారు. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో తాగునీటికి మాత్రమే సరిపడా నీరు అందుబాటులో ఉందన్నారు. గోదావరి బేసిన్‌లోని ఎస్సారెస్పీ, నిజాంసాగర్, సింగూరు, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు ఇప్పటివరకు వరద రాలేదని, వచ్చే వారం రోజులపాటు భారీ వర్షాల అవకాశాలు లేవని వాతావరణ శాఖ అంచనా వేసిందన్నారు. నిపుణుల అంచనాల ప్రకారం ఈ సీజన్‌లో ఆగస్టులో మాత్రమే సాధారణానికి సమీపంలో వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, జూలైలో 25 శాతం, ఆగస్టులో 9 శాతం, సెప్టెంబరులో 42 శాతం, అక్టోబరులో 55 శాతం లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వచ్చే వరదలపైనే కృష్ణా, గోదావరి ప్రాజెక్టులు నిండే పరిస్థితి ఆధారపడి ఉందని, ఆ అవకాశాలు కూడా పరిమితంగానే ఉన్నాయని తెలిపారు.గోదావరి, కృష్ణా బేసిన్ పరిధిలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున ఈ ఖరీఫ్‌లో సాగునీటి విడుదలకు ప్రణాళికలు లేవని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని మంత్రి ఆదేశించారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల పరిధిలో సాధ్యమైన మేరకు నీటిని తరలించి చెరువులు, కుంటలు నింపేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. సాగునీటి లభ్యత లేని ప్రాంతాల్లో రైతులు వరి సాగు చేయవద్దని స్పష్టమైన



సందేశం ఇవ్వాలని, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. రైతు వేదికలు, ప్యాక్స్‌ల ద్వారా రైతులకు నీటి లభ్యత, వర్షపాతం అంచనాలపై విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి రైతు వాస్తవ పరిస్థితులను తెలుసుకుని పంటలు సాగు చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం, జలాశయాల్లో నీటి కొరతపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, వాతావరణం, వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజాప్రతినిధులు, రైతుల కు సమాచారం అందించాలని సూచించారు. నీటి లభ్యతకు అనుగుణంగా విత్తనాల సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, జూలై 15 తర్వాత జలాశయాల్లో నీటి నిల్వలను సమీక్షించి ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వరద పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద వస్తే వెంటనే నీటిని ఎత్తిపోసేలా పంపింగ్ వ్యవస్థలను సిద్ధంగా ఉంచాలని, అప్పటివరకు అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, సూపర్ ఎల్‌నినో పరిస్థితి వాస్తవమని, ప్రతి సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకోవాలని అన్నారు. రాష్ట్రంలో 132 లక్షల ఎకరాల సాగు లక్ష్యానికి గాను ఇప్పటివరకు 55 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు జరిగిందన్నారు. జిల్లాలోని నీటి వనరుల పరిస్థితిని పరిశీలించి పంటల వైవిధ్యీకరణను విస్తృతంగా ప్రోత్సహించాలని, ఆయిల్‌పామ్, ఉద్యాన పంటలు, పట్టు పరిశ్రమకు అనుకూల పంటలు, తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని, రైతులకు వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ అవగాహన కల్పించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులతో జిల్లాలోని నీటి లభ్యత, పంటల సాగు పరిస్థితులను సమీక్షించారు. ఈ సీజన్‌లో ఎస్సారెస్పీ నుంచి సాగునీరు వచ్చే అవకాశం లేదని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. బోర్ వెల్ వంటి స్వంత నీటి వనరు ఉన్న రైతులు మాత్రమే వరి సాగు చేయాలని, ఇతర రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్.లత, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



చెడు అలవాట్లకు దూరంగా ఉండండి

జీవితాలను వెలిగించుకోండి

కరీంనగర్ పోలీస్ కమీషనర్ మహ్మద్ గౌస్ అలం

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాత వార్త: నేటి ఆధునిక సమాజంలో విద్యార్థి దశ నుండి చిన్న, పెద్ద వయస్సుతో తేడాలు లేకుండా నేటి యువతరం చెడు అలవాట్లకు దగ్గరవుతూ బంగారం లాంటి భవిష్యత్తును నిర్వీర్యం చేసుకుంటున్నారని కరీంనగర్ పోలీస్ కమీషనర్ మహ్మద్ గౌస్ అలం ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని సువర్ణ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులు, యువత తల్లిదండ్రులతో అశేషంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిసి గౌస్ అలం యువత భవిష్యత్తు పై తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపి తో పాటు హుజూరాబాద్ అసిస్టెంట్ పోలీస్ కమీషనర్ వాసంశెట్టి మాధవి హాజరయ్యారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో, ఆశయాలతో బిడ్డలను ఉన్నత చదువులను చదివించి సమాజం గర్వించదగ్గ పౌరులుగా తీర్చిదిద్దలన్న ఆశయాలకు మత్తు పదార్థాల వల్ల, మాదక ద్రవ్యాల వల్ల అలవాటు పడుతున్న యువతరం వారి జీవితాలను చీకటిమయం చేసుకుంటూ తల్లిదండ్రుల ఆశయాలను నిర్వీర్యం చేస్తున్నారని, విద్య నేర్పిన గురువులు సమాజానికి వీరి వల్ల నష్టం వాటిల్లుతుందని అన్నారు. యువత మత్తు పదార్థాల పట్ల, మాదక ద్రవ్యాల పట్ల, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మంచి స్నేహితులతో, మంచి బాటలో ముందుకు పయణించాలని సిపి గౌస్ అలం పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రాణాలను కాపాడుకోవాలని ఆయన అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ఆటో డ్రైవర్లు కెపాసిటికి మించి అధికంగా ప్రయాణికులను ఎక్కించుకోవడం అనార్థాలకు దారితీస్తుందని సిపి గౌస్ అలం ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ బిడ్డల పట్ల ఎప్పుడు ఒక కన్ను కనిపెడుతూ వారి అలవాట్లను, వారు చేస్తున్న స్నేహాలను పరిశీలించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పై ఉందన్నారు. ఎక్కడైనా గంజాయి, గుట్కా, మత్తు పదార్థాలు, డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు మీ దృష్టికి వచ్చినప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సిపి గౌస్ అలం విజ్ఞప్తి చేశారు. ఎక్కడైన రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులను మానవీయ కోణంలో అప్పటికప్పుడు స్పందించి ఏదైనా వాహనంలో సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించి ప్రాణాలు ప్రాణాలు కాపాడిన వ్యక్తుల గురించి ప్రభుత్వానికి వారి పేర్లను సిఫార్సు చేస్తుందని, వారికి ప్రభుత్వం రూ. 25వేల నగదు పారితోషికాన్ని అందజేస్తుందని సిపి గౌస్ అలం అన్నారు. హుజూరాబాద్ సబ్ డివిజన్ పరిధిలో మంచి ప్రశాంత వాతావరణం ఉందని, ఈ నడవడికను ఇలానే కొనసాగించాలని ఈ ప్రాంత పోలీస్ అధికారులను పోలీస్ కమీషనర్ గౌస్ అలం అభినందించారు. అశేషంగా తరలివచ్చిన యువతను ఉద్దేశించి ఏసిపి వాసంశెట్టి మాధవి మాట్లాడుతూ.... పోలీస్ శాఖ ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడటానికి వారి ప్రాణాలను, ఆస్తులను కాపాడానికి ఎంత కట్టుబడి ఉందో ప్రతి పౌరుడు తన విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని, సమాజంలో గొప్ప పౌరులుగా రాణించాలని ఏసిపి మాధవి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్. రామకృష్ణ గౌడ్, పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, రూరల్ సిఐలు పులి వెంకట్, శ్రీనివాస్, పలువురు సబ్ ఇన్స్పెక్టర్ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ ఏఈ

రూ. 10 వేలు తీసుకుంటుండగా పట్టివేత



కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త: ఇందు కలదందు లేడని సందేహం వలదు ఎందెందు వెతికిన అందందు కలదు అవినీతి అన్నట్లుగా తయారైంది ప్రభుత్వ శాఖల పరిస్థితి. ఒకప్పుడు రెవెన్యూ పోలీస్ శాఖ లోనే అవినీతి జరుగుతుందని లెక్కలు చెబుతున్న... ప్రస్తుతం పరిస్థితి మారింది. ప్రతి ప్రభుత్వ శాఖలోనూ అధికారులు అందిన కాడికి దోచుకుంటూ కోట్లకు పడగలెత్తుతున్నారు. రోజుకోచోట అవినీతి అధికారులు పట్టుబడుతున్న పనితీరులో మార్పు రావడం లేదు. తాజాగా పంచాయతీరాజ్ ఏఈ గతంలో పనిచేసిన చోట ఇవ్వవలసిన బిల్లు విషయంలో లంచం తీసుకుం టూ రెడ్ హ్యాండెడ్గా పట్టుబడ్డాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పంచాయతీరాజ్ విభాగం చొప్పదండి ఏఈగా పనిచేస్తున్న పైడి సతీష్ గతంలో గంగాధర మండలం ఏ ఈ గా పనిచేశాడు. అప్పుడు చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్కు మొండి చేయి చూపాడు. బిల్లు రావాలంటే లంచం ఇవ్వాల్సిందేనని పట్టు పట్టడంతో చేసేది లేక బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించాడు. బాధితుని ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు గురువారం పదివేల రూపాయలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం రసాయనిక పరీక్షలు నిర్వహించి లంచం తీసుకున్నది నిజమేనని నిర్ధారించుకుని అదుపులోకి తీసుకొని ఏసిబి కార్యాలయానికి తరలించారు. సతీష్ పని చేసిన కార్యాలయంలో పలు కీలక ఫైళ్ళను కూడా స్వాధీనం చేసుకున్నారు. పూర్తి విచారణ అనంతరం కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ విజయకుమార్ తెలిపారు.

అనుపురం ఇస్లాం నగర్ వద్ద

ఘోర రోడ్డు ప్రమాదం..

ఒక మహారాష్ట్ర కూలీ దుర్మరణం!

ఇద్దరికి సీరియస్.. వరంగల్ తరలింపు

అనుపురం రోడ్డు ప్రమాదంపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి.. ప్రమాద సమయంలో టాటా ఏస్ వాహనంలో 23 మంది

బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది: విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ అర్బన్ ప్రభాతవార్త : వేములవాడ అర్బన్ మండలం అనుపురంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన అతుల్ (35) వలస కూలీ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మరికొందరి పరిస్థితి అత్యంత విషమంగా వుంది. మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన కొందరు కూలీలు పనుల నిమిత్తం తంగళ్లపల్లి, లక్ష్మీపురం వద్ద వారి నాటుకి వెళ్లి తిరిగి బోయినపల్లి మండలం వరదవెళ్లి గ్రామంలోని వారి నివాసానికి ఏపీ01శ్రీ9735 నంబర్ గల టాటా ఏస్ వాహనంలో 23 మంది కూలీలు వెళ్తుండగా వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామ శివారులో టి ఎస్ 23గి4700 నంబర్ గల బస్సు వెనుక నుంచి బలంగా ఢీ కొట్టడంతో ప్రమాదం సంభవించిందని స్థానికులు తెలిపారు. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా భయానకంగా మారింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వేములవాడ పోలీసులు, స్థానికుల సహాయంతో క్షతగా త్రులను చికిత్స నిమిత్తం తక్షణమే వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలిం చారు. వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జిల్లా ఎస్పీ మహేష్ బి గీతేతో కలిసి ప్రభుత్వ విప్ పరామర్శించారు. బాధితులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.



అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. 23 మంది కూలీలు ఉన్నారని, వారిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఆ ఇద్దరిని మెరుగైన వైద్య చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. బాధితులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూస్తామని ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు.

న్యాయం చేయాలంటూ కలెక్టరేట్‌లో పురుగుల మందు డబ్బాతో మహిళ ఆత్మహత్యాయత్నం!

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



తమకు అండగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులే దౌర్జన్యానికి దిగుతుండటంతో న్యాయం కోసం ఓ మహిళ కలెక్టరేట్ వేదికగా పురుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగింది.జగిత్యాల మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన బెజ్జంకి నిహారిక అనే మహిళ కలెక్టరేట్ ప్రాంగణంలో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం అక్కడ తీవ్ర కలకలం రేపింది.అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు సకాలంలో స్పందించి ఆమె చేతిలోని పురుగుల మందు డబ్బాను స్వాధీనం చేసుకోవడంతో ప్రమాదం తప్పింది.బాధితురాలు నిహారిక తెలిపిన వివరాల ప్రకారం తన తండ్రి పసుపు కుంకుమ కింద ఇచ్చిన 30 గుంటల భూమిని తాను చదును చేసుకుంటుండగా వెల్దుర్తి గ్రామ సర్పంచ్ భర్త రవి తనను అడ్డుకుంటూ తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నాడని ఈ భూమి వివాదంపై స్థానిక తహశీల్దార్ విచారణ జరిపి నిహారికకే అనుకూలంగా నివేదిక ఇచ్చినప్పటికీ,సర్పంచ్ భర్త రవి అధికారులను సైతం లెక్కచేయకుండా దౌర్జన్యానికి దిగుతున్నాడని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.అధికార బలంతో తనను మానసికంగా వేధిస్తున్నారని తనకు న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యమని ఆమె వాపోయింది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సర్పంచ్ భర్తపై కఠిన చర్యలు తీసుకుని,తన భూమిని తనకు దక్కేలా చూడాలని బాధితురాలు కన్నీరుమున్నీరైంది పోలీసులు నిహారికకు నచ్చజెప్పి ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

లేని భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు

ముంజంపల్లి లింగమూర్తి ఆరోపణలు అబద్ధం

9 ఎకరాల 10 గుంటల భూమి మాదే..

రికార్డులు మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ విచారణ జరిపినా తిరిగి పేరు నమోదు చేయడంపై అనుమానాలు



పెద్దపల్లి, ప్రభాతవార్త: ఎలిగేడు సర్వే నెంబర్ 226లో లేని భూమిని సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారని, తమపై భూకబ్జా ఆరోపణలు చేయడం అన్యాయమని రైతులు తీవ్రంగా మండిపడ్డారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైతులు మాట్లాడారు. ముంజంపల్లి లింగమూర్తి ఇటీవల నిర్వహించిన ప్రెస్ మీట్ లో చేసిన ఆరోపణలను తాము పూర్తిగా ఖండిస్తున్నామని, తమ వద్ద ఉన్న అధికారిక ధ్రువీకరణ పత్రాల ఆధారంగా ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో దాగి ఉన్న నిజానిజాలను వెలికితీసి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ నిధులకు నష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సర్వే నెంబర్ 226లో మొత్తం 11 ఎకరాల 20 గుంటల భూమి ఉండగా, అందులో 32 గుంటల భూమిని రహదారులు భవనాల శాఖ రోడ్డు నిర్మాణం కోసం, మరో ఎకరం 18 గుంటల భూమిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాలువ, ఫీడర్ ఛానల్ నిర్మాణానికి ప్రభుత్వం గతంలోనే స్వాధీనం చేసుకుందని స్పష్టం చేశారు. ఆ విధంగా ప్రభుత్వ అవసరాలకు పోగా మిగిలిన 9 ఎకరాల 10 గుంటల భూమిని తమ తండ్రి సింగిరెడ్డి మల్లారెడ్డి 1979లో చట్టబద్ధంగా కొనుగోలు చేసి పట్టా పొందారని, అప్పటి నుంచి నేటి వరకు తామే ఆ భూమిని సాగు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సర్వే నెంబర్ 226లో ఎలాంటి మిగులు భూమి లేకపోయినా, 2012లో 18 గుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి, అనంతరం 2015లో అదే భూమిని ముంజంపల్లి లింగమూర్తి పేరిట నమోదు చేశారని ఆరోపించారు. తాము సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన అధికారిక రికార్డుల్లో కూడా సర్వే నెంబర్ 226లో ఎలాంటి మిగులు భూమి లేదని స్పష్టంగా ఉందని తెలిపారు. గతంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జరిగిన విచారణలో లింగమూర్తి పేరును రికార్డుల నుంచి తొలగించినప్పటికీ, అనంతరం మళ్లీ 226/బి/1 పేరుతో తిరిగి నమోదు చేయడం అనేక అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు.ఈ విలేకరుల సమావేశంలో సింగిరెడ్డి రామచంద్రారెడ్డి, కోటిచింతల మురళీధర్ రావు, తాటికొండ అనిల్, భీం సేన్ గొడిసేలా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఐపీఎస్ విద్యార్థులు

సుల్తానాబాద్, ప్రభాతవార్త:



పెద్దపల్లి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోదావరిఖనిలో నిర్వహించిన అండర్17 బాల, బాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఇండియన్ పబ్లిక్ పాఠశాల (ఐపీఎస్), సుల్తానాబాద్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు వికారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొననున్నట్లు కోచ్ బొల్లి సత్యనారాయణ తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారని, రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షి ంచారు. క్రీడలను ప్రోత్సహించడంలో ఐపీఎస్ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత,పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, సతీష్, జ్యోతి పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ఉరి వేసుకుని ఆత్మ హత్య

తిమ్మాపూర్, ప్రభాత వార్త :

తిమ్మాపూర్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన మామిడి ప్రకాశం (72) గ్రామంలోని నల్ల చెరువు లో చెట్టు కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటంతో జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి ముగ్గురు కుమారులు ఒక కూతురు ఉన్నారు. పోలీస్ లు సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. మృతుని చిన్న కుమారుడు అనిల్ కుమార్ మామిడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్ లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు..

నర్సింగ్ ఆఫీసర్ కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:



పెద్దపల్లి మండలం రాఘవాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నర్సింగ్ ఆఫీసర్‌గా పని చేస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన ధనలక్షి ్మ కుటుంబాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పెద్ద పెల్లి డాక్టర్ వై పవిత్ర గురువారం పరామర్శించారు. ధనలక్షి ్మ ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థిస్తూ వారికి రావలసిన రాయితీలు అన్నింటిని కూడా గౌరవంగా ఇప్పించడానికి ప్రయత్నం చేస్తానని తెలిపారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చేపల వేటలో జలసమాధి అయిన మత్స్యకారుడు

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలోని పెద్ద చెరువులో జరిగిన విషాద ఘటన మత్స్యకార కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. రాజపల్లి గ్రామానికి చెందిన ఈర్ల రవిందర్ అనే మత్స్యకారుడు గురువారం తోకలపల్లి, రాజపల్లి, చెల్పూర్ గ్రామాలకు చెందిన సుమారు యాభై మంది తోటి మత్స్యకారులతో కలిసి చేపలు పట్టేందుకు చెరువుకు వెళ్లాడు. దురదృష్టవశాత్తూ, చేపలు పడుతున్న సమయంలో రవిందర్ కాలికి ఉన్న బేడి ప్రమాదవశాత్తూ వలలో చిక్కుకోవడంతో అతను నీటిలో మునిగిపోయాడు. గమనించిన తోటి మత్స్యకారులు వెంటనే స్పందించి రవిందర్‌ను కాపాడేందుకు శతవిధాలా ప్రయత్నించినప్పటికీ, అప్పటికే అతను అధిక మొత్తంలో నీటిని మింగడంతో ప్రాణాలు విడిచాడు. కళ్లముందే తోటి మిత్రుడు మృత్యుఒడికి చేరుకోవడంతో తోటి మత్స్యకారులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. మృతుడు రవిందర్‌కు భార్య, ముగ్గురు చిన్న పిల్లలు ఉండటంతో ఆ కుటుంబం ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో రోదనలు చేస్తోంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న హుజురాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలు-దారుణాలు

అనారోగ్యం తాళలేక వ్యక్తి ఆత్మహత్య

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం రూరల్ హబ్సిపూర్ గ్రామానికి చెందిన దానపెల్లి గంగరాజు అనే వ్యక్తి అనారోగ్య సమస్యలు తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.పోలీసుల కథనం ప్రకారం గంగరాజు గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు.ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆయన, గురువారం ఉదయం సమయంలో ఇంట్లో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చందుర్తి / ప్రభాత వార్త

వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి వాగులోంచి రామారావు పల్లె గ్రామానికి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్ ను గురువారం చందుర్తి ఎస్సై జిల్లెల్ల రమేష్ పట్టుకున్నారు.మండలంలోని వివిధ గ్రామాలకు అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న కొలె అంజయ్య కు చెందిన టీఎస్ 23 టీ8232 ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకొని తదుపరి చర్యల నిమిత్తం పోలీస్ స్టేషన్ కు తరలించామని పేర్కొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

జగిత్యాల జిల్లాలో మానసిక వికలాంగురాలైన మహిళపై అత్యాచారానికి ఒడిగట్టిన నిందితునికి కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది. గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2024 జూన్ నెలలో ఓరుగంటి శ్రీనివాస్ అనే వ్యక్తి ఈ అమానుషానికి పాల్పడ్డాడు.బాధితురాలి తరఫున పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు.ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీస్ యంత్రాంగం నిందితునిపై కోర్టులో బలమైన సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టింది.ఇరుపక్షాల వాదనలు విన్న జగిత్యాల ఒకటవ అదనపు జిల్లా అండ్ సెషన్స్ న్యాయమూర్తి సునీత రవీంద్ర రెడ్డి నేరం రుజువు కావడంతో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష,ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.దీంతో పాటు బాధిత మహిళకు 1,50,000 రూపాయల ఆర్థిక పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది.పోలీస్,ప్రాసిక్యూషన్ విభాగాల సమన్వయంతో, పక్కా వ్యూహంతో విచారణ జరిపి నిందితునికి వేగంగా శిక్ష పడేలా కృషి చేసిన అధికారులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.కేసు దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బిట్ల నర్సయ్య, ఇన్స్పెక్టర్ రామ్ నరసింహ రెడ్డి,అప్పటి ఎస్ఐ సతీష్,సీఎమ్ఎస్ ఎస్ఐ శ్రీకాంత్,కోర్టు కానిస్టేబుల్ శ్రీధర్, సీఎమ్ఎస్ కానిస్టేబుల్ రాజులకు ఎస్పీ ప్రశంసించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళల రక్షణకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యతనిస్తుందని స్పష్టం చేశారు. సమాజంలో నేరాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా చట్టం ముందు లొంగక తప్పదని,కఠిన శిక్షలు ఖాయమని హెచ్చరించారు.మహిళలు, యువతులు ఎలాంటి వేధింపులు లేదా అన్యాయాలు ఎదుర్కొన్నా భయపడకుండా తక్షణమే పోలీసులను ఆశ్రయించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా శ్రీ శిర్డీ సాయిబాబా దేవాలయ 17వ వార్షికోత్సవం

సుల్తానాబాద్, ప్రభాతవార్త:

పట్టణంలోని స్వప్న కాలనీలోని శ్రీ గణపతి దత్తాత్రేయ సుప్రభాత శ్రీ శిర్డీ సాయిబాబా దేవాలయ 17వ వార్షికోత్సవం మహోత్సవాలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి సాయిబాబా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, విశేష అభిషేకం, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామార్చన, ప్రత్యేక అర్చనలు, హోమాలు, మంగళహారతులు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, మహామంగళహారతి తర్వాత భక్తులందరికీ మహా అన్నదానం నిర్వహించారు.కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధన నాయక దామోదర్ రావు, కాంగ్రెస్ నాయకుడు అమ్మిశెట్టి తిరుపతి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సాయిబాబాను ప్రార్థించినట్లు తెలిపారు. వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు మాటేటి కృష్ణప్రియ-సంజీవ్, ఎడవెల్లి భారతి-రాంరెడ్డి, మాదూరి అరుణ-ప్రసాద్, చకిలం రమాదేవి-సత్యనారాయణ, జూలూరి సునీతారాణి-అశోక్, వెంగళదాస్ రజని-శ్రీధర్, యెల్లెంకి విజయ-వైకుంఠం,ముస్యాల లావణ్య-నాగేశ్వర్, కట్ల శారద-సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య ఆయుధం

భీమారం/మేడిపల్లి, ప్రభాతవార్త

:ఓటు హక్కు ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. భీమారం మండల కేంద్రంతో పాటు దేశాయిపేట, కమ్మరిపేట, పసునూరు, గోవిందారం, మోత్కురావుపేట, రాజలింగంపేట, మేడిపల్లి మండలంలోని దమ్మన్నపేట, వల్లంపల్లి, మాచాపూర్ గ్రామాలకు చెందిన పోలింగ్ బూత్ ఏజెంట్లు, సభ్యులతో



గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై బూత్ లెవల్ ఏజెంట్లకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సర్ ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా బూత్ లెవల్ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ప్రతి ఓటరు తమ హక్కును సద్వినియోగం చేసుకునేలా గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో మండల సీనియర్ నాయకులు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు, బూత్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కోరుట్లలో బుధవారం అర్ధరాత్రి దారుణ హత్య

భర్తను చంపిన భార్య అరెస్టు

కోరుట్ల, ప్రభాతవార్త :

భర్త వేధింపులు తాళలే కకట్టుకున్న భర్తను హత్య చేసిన ఘటన కోరుట్ల పట్టణంలో బుధవారం రాత్రి జరిగింది. పట్టణంలోని అల్లమ్మయ్యగుట్ట కాలనీలో నివాసం ఉంటున్న ఇప్ప కాశీరాం, రజని అనే దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవని, ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి భర్త కాశీరం భార్యపై మరోసారి గొడవకు దిగాడు. సహనం కోల్పోయిన భార్య తన భర్త కాశీరంను రోకలి బండతో తలపై బలంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భర్తను హత్య చేసిన నిందితురాలు అరెస్ట్ కోరుట్ల పట్టణంలో అన్నమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన భర్తను హత్య చేసిన నిందితురాలు భార్యను కోరుట్ల పోలీస్ స్టేషన్లో గురువారం అరెస్టు చూపారు. కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెట్పల్లి డిఎస్పి ఏ. రాములు మాట్లాడుతూ నిన్న రాత్రి అన్నమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన ఇప్ప కాశిరాం (35)ను



అతని భార్య రజినితో గత 14 సంవత్సరాల క్రితం వివాహమైంది. మీరు ఇరువురికి ఇద్దరు పాపలు, ఒక బాబు కలరు. గత కొన్ని రోజుల క్రితం భర్త తో పాటు భార్య రజిని కూడా మద్యం తాగినదని, ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మద్యం తగిన విషయాన్ని మనసులో పెట్టుకొని భర్త కాశీరం ప్రతిరోజు మద్యం తాగి వచ్చి భార్య రజిని కొడుతూ పిల్లల్ని ఇబ్బంది పెడుతున్నారని, అతని వల్ల తనకు తన పిల్లలకు ప్రతి విషయం లో ఇబ్బందులు ఎదురు అవుతున్నాయని, ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని, గత 20 రోజుల క్రితం తన భార్య రజిని భర్తను చంపాలని క్రరతో దాడి చేయగా తమ ఇంటి పక్కనవున్నా వారు వచ్చి అతనిని కాపాడి ఆసుపత్రికి తరలించి కాశీరాంను బ్రతికించారు. బుధవారం రాత్రి కాశీరాం తన కుటుంబ సభ్యులతో మధ్యాహ్నం చెట్ల పండగ వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి మళ్ళీ రాత్రి బయటకు వెళ్లినాడు. రజిని తన భర్తను చంపాలని ఆలోచన తోటి తన పిల్లలను ముందుగానే తన తల్లి గారింటికి పంపి మద్యం సేవించి ఇంటికి వచ్చిన భర్త తో ఉద్దేశపూర్వకంగా గొడవపడి నా అందాజ రాత్రి 11. 45 నిమిషాలకు సరిఅయిన సమయం గా భావించి కాశీరాంను తన ఇంటిలోని రోకలిబండతో తలపై, ఇతర చోట్ల బలంగా కొట్టగా తలపై తీవ్ర రక్త గాయాల వల్ల మృతులు కాశీరాం అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ఇంటి నుండి పారిపోయి అయ్యప్ప స్వామి ఆలయం వెనకాల ఉన్న బంధువుల దగ్గర పడుకొని గురువారం పారిపోతుండగా నమ్మదగిన సమాచారంతో సీఐ, ఎస్ఐ, వారి సిబ్బంది నిందితురాలును అదుపులోకి తీసుకొని హత్యకు ఉపయోగించినటువంటి రోకలిబండను స్వాధీన పరుచుకున్నట్లు వివరించారు. దర్యాప్తులో నేరం రుజువు చేయటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అరెస్టు చేసిన సిఐ, ఎస్ఏ, లను డిఎస్పి అభినందించారు.

కోరుట్ల వార్త



మేడిపల్లిలో ఎరువుల దుకాణాలలో తనిఖీలు

మేడిపల్లి, ప్రభాతవార్త:



మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఎరువులు, విత్తన దుకాణాలను మండల వ్యవసాయ అధికారి ఎండి షాహిద్ అలీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, స్టాక్ వివరాలను పరిశీలించారు. తప్పనిసరిగా రైతుల వివరాలను నమోదు చేయాలని, నిబంధనలు పాటించని వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని సూచించారు. సీజన్ పూర్తయ్యే వరకు రసీదులను భద్రంగా ఉంచుకోవాలని, అనివార్య పరిస్థితుల్లో రసీదుల ఆధారంగా రైతులు అవసరమైన సహాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇదిలా ఉండగా మేడిపల్లి వ్యవసాయ కార్యాలయంలో రైతులకు నాణ్యమైన కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి తెలిపారు.ఆత్మ నిర్భరత కార్యక్రమంలో భాగంగా ఎల్ఆర్జీ52 రకం సర్టిఫైడ్ కంది విత్తనాలను జనరల్ సేల్ కింద రైతులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కంది విత్తనాలు కావాల్సిన రైతులు తమ పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు వివరాలతో మేడిపల్లి వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించి విత్తనాలు పొందాలని ఆయన కోరారు. రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.

మన్నెగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో ఒడిస్సీ నృత్య ప్రదర్శన.



భీమారం, ప్రభాతవార్త :

భారతీయ సాంప్రదాయ కళల పట్ల విద్యార్థుల్లో ఆసక్తి, అవగాహన పెంపొందించేందుకు స్పిక్ మెకే తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో భీమారం మండలంలోని మన్నెగూడెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఒడిస్సీ నృత్య కళాకారిణి తులికా రెడ్డి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఒడిస్సీ నృత్యంలోని వివిధ భంగిమలు, కళా విశిష్టతలను వివరించారు. అనంతరం తన అద్భుతమైన నృత్య ప్రదర్శనతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా తులికా రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత యువత పాశ్చాత్య సంస్కృతికి ఆకర్షితులవుతున్న నేపథ్యంలో భారతీయ సాంప్రదాయ కళలు, నృత్యాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే జగిత్యాల జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఒడిస్సీ నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో భారతీయ కళల పట్ల ఆసక్తిని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

కోరుట్ల టౌన్, ప్రభాతవార్త :

గుంటుక మహేష్ జన్మదిన వేడుకల సందర్భంగా కోరుట్ల సాయిబాబా ఆలయంలో అన్నదానం, నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు లయన్ గుంటుక మహేష్, కార్యదర్శి లయన్ బెజ్జంకి శ్రీనివాస్ రావు, కోశాధికారి లయన్ పోలాస రవీందర్, లయన్ గంద్ర అజయేందర్ రావు, లయన్ మంచాల జగన్, లయన్ పడాల నారాయణ గౌడ్, లయన్ అలిశెట్టి భూమ్ రెడ్డి, లయన్ మండలోజు రవీందర్, లయన్ కొమ్ముల జగపతి రెడ్డి లయన్ కల్లెం గంగారెడ్డి, లయన్ పోతుకూరి రవీందర్ రెడ్డి, లయన్ చెన్న శ్రీనివాస్, లయన్ కుదాల రాజేంద్ర ప్రసాద్, లయన్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధుల నివార



కోరుట్ల, ప్రభాతవార్త :

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వీ. రాఘవేంద్ర కోరారు. గురువారం పట్టణంలోని 2వ వార్డులో పారిశుద్ధ్య పనులు, డ్రై డే, యాంటీ లార్వా చర్యలను స్వయంగా పరిశీలించారు. ఇళ్లలో పాత టైర్లు, కూలర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వలపై యాంటీ లార్వా స్ప్రేలు చల్లాలని, ఆయిల్ బాల్స్ వెయ్యాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ప్రతిరోజు డ్రై డే నిర్వహించాలని పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, అశోక్, జవాన్లు, పాల్గొన్నారు.



పలు అభివృద్ధి పనులకు భూమి పూజ



కోరుట్ల రూరల్, ప్రభాతవార్త :

గ్రామంలోని అనుమతి వచ్చిన పలు ఉపాది హామీ సిసి రోడ్డులకు భూమి పూజ చేసి పనులను గురువారం ప్రారంభించారు. గ్రామంలోని ముంజ భాగ్య లింభయ్య ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం లో పాల్గొని చీర సారె లతో వారిని సర్పంచ్ శ్రీమతి చీటి స్వరూప వెంకట్రావ్ సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధవేణి మహేష్ గౌడ్, కార్యదర్శి శేఖర్, వార్డు సభ్యులు బొలుమల్ల నరేష్, వల్లకొండ శ్రీరహరి, చింతకింది భాస్కర్, తుదిగేని రోహిని, వల్లకొండ గౌతమి గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

గడి పాఠశాలలో హెల్త్ క్యాంప్

కోరుట్ల, ప్రభాతవార్త :

కోరుట్ల మండలంలోని ప్రాథమిక పాఠశాల ఎస్ఆర్ఎస్పీ క్యాంప్, గడి, కల్లూరు రోడ్ గురువారం విద్యార్థులకు హెల్త్ క్యాంప్ నిర్వహించి, వైద్య పరీక్షలు చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన ఆరోగ్య సూచనలు అందించారు. ఆరోగ్య పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ పరిశుభ్రత, పోషకాహారం, వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేకంగా సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నునావత్ రాజు, డాక్టర్ సాజియా, అబ్దుల్ రహూఫ్, పూర్ణ చందర్, ధనలక్ష్మి, సుమలత, భవాని, రాజ్ కుమార్, శ్రీనివాస్, ఎఎన్ఎం లు శిరీష, విజయ లక్ష్మీ, ఆశ వర్కర్ అన్నపూర్ణ, జ్యోతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ఫారముల ఆన్ లైన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశం

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూలై 09, ప్రభాతవార్త:



జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ఫారముల ఆన్ లైన్ నమోదును వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.గురువారం కలెక్టర్ భవేశ్ మిశ్రా బాసర, తానూర్, కుబీర్ మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. తొలుత బాసర గ్రామపంచాయతీ ఆవరణలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటివరకు స్వీకరించిన ఫారములు, పూర్తయిన డిజిటలైజేషన్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని, ఫారములు నింపడంలో బిఎల్ఓలు క్షేత్రస్థాయిలో ప్రజలకు సహాయం చేయాలని సూచించారు. సూపర్వైజర్లు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షి ంచాలని ఆదేశించారు.అనంతరం తానూరు మండలం సింగన్ గావ్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించారు. మొత్తం పంపిణీ చేసిన ఫారములు, తిరిగి స్వీకరించినవి, డిజిటలైజ్ చేసిన వివరాలపై అధికారుల నుంచి సమాచారం తీసుకున్నారు.కుబీర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలోనూ ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. యాప్ లో నమోదైన వివరాలను చెక్ చేశారు. అక్కడి నుంచి నేరుగా సమీపంలోని ఓటర్ ఇంటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారం పూర్తి చేశారా అని అడిగి తెలుసుకున్నారు. గడువు లోపు 100 శాతం ప్రక్రియ పూర్తి కావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ తనిఖీల్లో తహసిల్దార్లు పవన్ చంద్ర, మహేంద్రనాథ్, శ్రీదేవి, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచులు వెంకటేష్ గౌడ్, అన్నపూర్ణ, సాయినాథ్ తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కవిత చేసిన ఆరోపణలపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశించాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరిన

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: స్వయంగా కెసిఆర్ కుటుంబ సభ్యురాలు,ఇంటి మనిషి కవిత బి ఆర్ ఎస్ పార్టీ ,కేటీఆర్ ,హరీష్ రావుల మీద చేసిన అవినీతి,క్విడ్ ప్రో కో ఆరోపణల మీద సిబిఐ చేత వెంటనే విచారణ జరిపించాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ పార్టీ నిధులు, క్విడ్ ప్రో కో లావాదేవీలు, ప్రదీప్ కన్స్ట్రక్షన్స్‌తో జరిగినట్లు ఆరోపించిన ఒప్పందాలు, ఫీనిక్స్ సంస్థకు రాజకీయ అండ, గత ప్రభుత్వం మరియు ప్రస్తుత ప్రభుత్వం ఆంధ్రా కాంట్రాక్టర్లకు భూముల కేటాయింపులపై కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు.ఈ ఆరోపణలు ప్రజా ప్రయోజనాలకు సంబంధించినవని, వీటిపై ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా స్వతంత్ర సీబీఐ దర్యాప్తు జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి మీద దర్యాప్తును సిబిఐ కి అప్పగించడంలో జరిగిన జాప్యం,ఈకార్ రేసులో అవినీతికి పాల్పడ్డట్టు ఆధారాలున్నా విచారణ చేపట్టకుండా కేటీఆర్ ని రక్షించడం ,ఫోన్ టాపింగ్ కుంభకోణం బాధ్యులపై ఇప్పటివరకు చర్యలు తీసుకోపోవడంవల్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధిని ప్రజలు ఇప్పటికే శంకిస్తున్నారని,కాంగ్రెస్ బీఆర్ఎస్ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని ప్రజలు భావిస్తున్నారని అర్వింద్ పేర్కొన్నారుప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలంటే ప్రభుత్వం వెంటనే ఈ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని, పూర్తి పారదర్శకతతో నిజానిజాలను వెలుగులోకి తీసుకువచ్చి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.

ఘనంగా శ్రీ శిర్డీ సాయిబాబా దేవాలయ 17వ వార్షికోత్సవం

అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు..

ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు



సుల్తానాబాద్, ప్రభాతవార్త: పట్టణంలోని స్వప్న కాలనీలోని శ్రీ గణపతి దత్తాత్రేయ సుప్రభాత శ్రీ శిర్డీ సాయిబాబా దేవాలయ 17వ వార్షికోత్సవం మహోత్సవాలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి సాయిబాబా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, విశేష అభిషేకం, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామార్చన, ప్రత్యేక అర్చనలు, హోమాలు, మంగళహారతులు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, మహామంగళహారతి తర్వాత భక్తులందరికీ మహా అన్నదానం నిర్వహించారు.కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధన నాయక దామోదర్ రావు, కాంగ్రెస్ నాయకుడు అమ్మిశెట్టి తిరుపతి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు మాటేటి కృష్ణప్రియ-సంజీవ్, ఎడవెల్లి భారతి-రాంరెడ్డి, మాదూరి అరుణ-ప్రసాద్, చకిలం రమాదేవి-సత్యనారాయణ, జూలూరి సునీతారాణి-అశోక్, వెంగళదాస్ రజని-శ్రీధర్, యెల్లెంకి విజయ-వైకుంఠం, ముస్కాల లావణ్య-నాగేశ్వర్, కట్ల శారద-సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వేదపండితులు బ్రహ్మశ్రీ ఉప్పరమల్యాల లక్ష్మణశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించగా, కార్యక్రమ నిర్వహణను బ్రహ్మశ్రీ గూడ రమేష్ శర్మ చేపట్టారు.

ప్రభుత్వ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త



జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతి సంవత్సరం అందించే ప్లేట్లు, గ్లాసులను గురువారం స్థానిక కౌన్సిలర్ అరవ లక్ష్మి చేతుల మీదుగా విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అరవ లక్షి ్మ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ శాఖ విద్యార్థుల కోసం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వసతి గృహంలో ప్రభుత్వం కల్పిస్తున్న మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన భోజనం, సురక్షిత వాతావరణం మరియు ఇతర సౌకర్యాలను వినియోగించుకొని మరింత మంది విద్యార్థినులు ప్రభుత్వ వసతి గృహంలో చేరాలని పిలుపునిచ్చారు.హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ టి. శ్రీలత మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ప్రతి విద్యార్థిని సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని ఆకాంక్షి ంచారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ టి. శ్రీలత, హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

పాఠశాలల విద్యార్థులకు విరాసత్ వర్మ్ డెమోన్సేషన్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:





జగిత్యాల జిల్లాలోని ధర్మపురి మండలం వెలుగొండ నేరేళ్ల గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం స్పిక్ మాకే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలోవిరాసత్ వర్మాప్ డెమోన్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఉత్తరఖండ్ రాష్ట్రానికి చెందిన ప్రముఖ కళాకారిణి తృప్తి సన్వాల్ కథక్ నృత్యం విద్యార్థులకు నేర్పిస్తుంది . భారతీయ సంప్రదాయ కళారూపాలను అద్భుతంగాప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా కళల విశిష్టత, చరిత్ర,ప్రాముఖ్యతను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. తన ప్రత్యక్షప్రదర్శనలతో పాటు, కళలకు సంబంధించిన పలు మెళకువలనుడెమోన్స్రేషన్ రూపంలో చూపిస్తూ విద్యార్థులను ఎంతగానోఆకట్టుకున్నారు. ఈ విరాసత్ ప్రదర్శనకు వాలంటీర్లుగా నందిని మనీషా త్రిబుల్ ఐటీ బాసర విద్యార్థులు నిర్వహించారు.ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇలాంటి మత్స్య కార్యక్రమాలువిద్యార్థుల్లో భారతీయ సాంస్కృతిక వారసత్వంపై అవగాహపెంపొందించడంతో పాటు, ప్రాచీన కళల పట్ల ఆసక్తినిపెంచుతాయని చెప్పారు. విద్యార్థులకు మన సంస్కృతిని పరిచయంచేయడానికి స్పిక్ మాకే సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ల ప్రధాన ఉపాధ్యాయ, ఉపాధ్యాయులుబృందం, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలోఉత్సాహంగా పాల్గొని కళాకారిణిని ఘనంగా అభినందించి సన్మానించారు

దొంగతనాలపై అప్రమత్తంగా ప్రజలు ఉండాలి

ఎస్ఐ నరేష్



కొడిమ్యాల, ప్రభాతవార్త: జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇటీవల చోటుచేసుకుంటున్న దొంగతనాల ఘటనల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కొడిమ్యాల ఎస్ఐ నరేష్ సూచించారు. ముఖ్యంగా ఇంటికి తాళాలు వేసి పనుల నిమిత్తం బయటకు వెళ్లే కుటుంబాలనే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇళ్లలో పెద్ద మొత్తంలో నగదు, బంగారం, వెండి ఆభరణాలు, భూమి పత్రాలు, బ్యాంకు డాక్యుమెంట్లు, ఇతర విలువైన వస్తువులను ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని పోలీసులు సూచించారు. చిన్న నిరక్ష ్యమ్లే పెద్ద నష్టానికి దారితీసే అవకాశముందని హెచ్చరించారు. ఇంటి ప్రధాన ద్వారాలకు నాణ్యమైన తాళాలు ఏర్పాటు చేసుకోవడం, కిటికీలు, వెనుక ద్వారాలు బలంగా మూసివేయడం, వీలైనంత వరకు సీసీ కెమెరాలు, సెక్యూరిటీ అలారం వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవడం మంచిదని తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పొరుగువారికి లేదా బంధువులకు సమాచారం ఇచ్చి వెళ్లడం ద్వారా అనుమానాస్పద కదలికలను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు లేదా అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు, వాహనాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా అత్యవసర సేవల నంబర్లు 100 లేదా 112కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. ప్రజల సమాచారం ఆధారంగానే నేరాలను వేగంగా అరికట్టడం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష ్యమని, పోలీసు శాఖతో ప్రతి ఒక్కరూ సహకరిస్తూ అప్రమత్తంగా ఉంటే దొంగతనాలను సమర్థవంతంగా నివారించవచ్చని కొడిమ్యాల పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ఆర్ అండ్ బి అధికారుల నిరక్ష ్యం వల్లే...

మానకొండూర్, ప్రభాతవార్త:



మానకొండూరు మండల పరిధిలోని అన్నారం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మర్రి సతీష్ అనే యువకుడికి తీవ్ర గాయాలైనట్లు గురువారం గ్రామస్తులు తెలిపారు. మండలంలోని లలితాపూర్ గ్రామానికి చెందిన మర్రి సతీష్ తన పని నిమిత్తం కరీంనగర్ పట్టణానికి వెళ్లి తిరిగి తన బైక్ పై బుధవారం రాత్రి స్వగ్రామానికి వెళ్తుండగా మానకొండూర్ వీణవంక ప్రధాన రహదారి అన్నారం గ్రామ చెరువు కట్ట పై ఉన్న గుంతలో బైక్ అదుపుతప్పి పడడంతో తల భాగం పగిలి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం స్థానికులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ప్రధాన రహదారిపై గుంతలు పడి రోజులు గడుస్తున్న సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోవడంలేదని వాహనాదారులు ఆరోపిస్తున్నారు. ఆర్ అండ్ బి అధికారుల నిరక్ష ్యం వల్లే యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. ప్రధాన రహదారిపై గుంతలు పడ్డాయని, మరమ్మతులు చేపట్టాలని, గుంతల రోడ్లపై రాత్రి వేళలో వెళ్లాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని మానకొండూర్ ఆర్ అండ్ బి అధికారులకు పలుమార్లు తెలిపిన పట్టించుకోవడంలేదన్నారు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి ప్రధాన రహదారిపై పడ్డ గుంతలను పూడ్చిఎ ేయాలని వాహనాదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాల రుణాలను పెండింగ్‌లో ఉంచొద్దు

బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: ప్రభుత్వ ప్రాయోజిత పథకాల రుణ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా అర్హులైన వారికి వెంటనే రుణాలు మంజూరు చేసి యూనిట్లను గ్రౌండింగ్ చేయాలని, తిరస్కరించాల్సి వస్తే సరైన కారణాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి నిర్వహించిన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ (డీఎలఆర్సీ) సమావేశంలో జిల్లా కలెక్టర్ వివిధ బ్యాంకుల పనితీరు, ప్రభుత్వ పథకాల రుణాలు, వ్యవసాయ, ఎంఎసఎంఈ, పీఎం స్వనిధి రుణాల పంపిణీ, సామాజిక భద్రత పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,లి ప్రభుత్వ పథకాల కింద వచ్చే రుణ దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచరాదని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు వెంటనే రుణాలు మంజూరు చేసి యూనిట్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, తిరస్కరించే దరఖాస్తులకు సరైన కారణాలను స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు.

23వ వార్డులో ఎస్ ఐ ఆర్ హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించిన ఎమ్మార్వో, కమిషనర్

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :



మెట్‌పల్లి పట్టణంలోని 23వ వార్డులో ఏర్పాటు చేసిన ఎస్ ఐ ఆర్ ఫారమ్‌ల హెల్ప్‌డెస్క్‌ను ఎమ్మార్వో నీతా , మున్సిపల్ కమిషనర్ డి శ్రీనివాస్ గౌడ్ లు గురువారం సందర్శించారు. ప్రజలకు అందుతున్న సేవలు, ఫారమ్‌ల నమోదు పురోగతి, నమోదు శాతంపై వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సూచనల మేరకు, మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ రైసుద్దీన్ ఆధ్వర్యంలో ఆయన నివాసం సమీపంలో ఆజాద్ యూత్ అండ్ ఫౌండేషన్ సభ్యులు ఎస్ ఐ ఆర్ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక వార్డు ప్రజలకు ఎస్ ఐ ఆర్ ఫారమ్‌లను నింపడం, అవసరమైన పత్రాలను పరిశీలించడం, సందేహాలను నివృత్తి చేయడం వంటి సేవలు అందిస్తున్నారు. ఎమ్మార్వో నీతా, మున్సిపల్ కమిషనర్ డి శ్రీనివాస్ గౌడ్ లు బీఎల్ఓలు, ఆర్పీలు, వార్డు అధికారులు, వార్డు సూపర్వైజర్లకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేగ వంతంగా, పారదర్శకంగా ఎస్ఐఆర్ ఫారమ్‌ల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని, ప్రతి అర్హుడికి సేవలు అందేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ రైసుద్దీన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కాంగ్రెస్ నాయకుడు జేట్టి లక్ష్మణ్, ఆజాద్ యూత్ అధ్యక్షుడు సమ్ము, సభ్యులు ఫెరోజ్, తాలిబ్, ఫరీద్, అమ్ము, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

మల్లాపూర్, ప్రభాతవార్త:



గత 8 సంవత్సరాలుగా రాఘవపేట లో గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న కడుకుంట్ల బాబన్న సోమవారం రోజున మరణించగా.. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి గ్రామపంచాయతీ పాలకవర్గం నుండి రూ.30,000/లు ఆర్థిక సహాయన్ని గురువారం అందించడం జరిగింది. కార్మికుల కుటుంబానికి గ్రామపంచాయతీ పాలకవర్గం అండగా ఉంటుందని రాఘవపేట సర్పంచ్ తోట శ్రీనివాస్ పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దెల నర్సయ్య , వార్డ్ మెంబర్లు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలి

ఎంపిడీవో మహేందర్ రెడ్డి.



మెట్‌పల్లి, ప్రభాతవార్త: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ప్రభుత్వ మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఎంపిడీవో మహేందర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని టి.జి.ఎస్.డబ్ల్యూ.ఆర్.ఎఎస్, జే.సి. బాలికల గురుకుల విద్యాలయాన్ని మండల వైద్యాధికారి డా. ఎల్లాల అంజిత్ రెడ్డి తో కలిసి ఎంపిడీవో మహేందర్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం నాణ్యత,వంటగది పరిశుభ్రత,తాగునీటి సౌకర్యాలు,హాస్టల్ పరిసరాల పారిశుద్ధం, సిబ్బంది విధుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు.విద్యార్థినులకు పరిశుభ్రమైన, పోషకాహారం అందించడంతో పాటు హాస్టల్ పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులకు వారు సూచించారు.మండల వైద్యాధికారి అంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,ఆహార పదార్థాల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను పాటించాలని, సిబ్బంది తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యార్థినులకు మెరుగైన వసతులు, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్రపంచ స్థాయి అవకాశాల పరిచయం కల్పించడమే లక్ష్యం

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్.



మెట్‌పల్లి,ప్రభాతవార్త: నియోజకవర్గంలోని విద్యార్థులకు ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలను పరిచయం చేయడమే తన లక్ష్యం అని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు.ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి, కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక టీహబ్, టీవర్క్స్ సంస్థలను గురువారం సందర్శించారు.ఈపర్యటన ద్వారా విద్యార్థులకు స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,పారిశ్రామిక అవకాశాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యే మనిషికి నిజమైన సంపద అని,డిగ్రీ పూర్తి చేయడమే విజయానికి అంతిమ లక్ష్యం కాదని, ప్రపంచంతో పోటీ పడే స్థాయిలో నైపుణ్యాలను పెంపొందించుకుని, సృజనాత్మక ఆలోచనలతో కొత్త అవకాశాలను సృష్టించుకునే దిశగా ప్రతి విద్యార్థి కృషి చేయాలని పేర్కొన్నారు.టీహబ్, టీవర్క్స్ వంటి సంస్థలు యువతలో ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందిస్తూ,స్టార్టప్‌ల స్థాపన, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి,పరిశ్రమలతో అనుసంధానం,మెంటరింగ్, పెట్టుబడుల అవకాశాలు వంటి అనేక రంగాల్లో విశేష సేవలందిస్తున్నాయని తెలిపారు. ఈఅవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను ప్రపంచానికి చాటాలని ఎమ్మెల్యే సంజయ్ పిలుపునిచ్చారు. సందర్శనలో భాగంగా విద్యార్థులు స్టార్టప్‌లు ఎలా ప్రారంభమవుతున్నాయి, కొత్త ఆలోచనలు విజయవంతమైన సంస్థలుగా ఎలా రూపుదిద్దుకుంటున్నాయి, అత్యాధునిక యంత్రాలు, ప్రోటోటైపింగ్ సెంటర్లు, పరిశోధన సౌకర్యాలు ఎలా పనిచేస్తున్నాయి,యువతకు అందిస్తున్న శిక్షణ, సాంకేతిక సహకారం, పారిశ్రామిక మార్గదర్శకత్వం వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించి విలువైన అవగాహన పొందారు.ఈ పర్యటన తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిందని, సృజనాత్మక ఆలోచనలకు కొత్త దిశ చూపిందని, భవిష్యత్తులో ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే సంకల్పాన్ని మరింత బలపరిచిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకుని అన్ని రంగాల్లో రాణించాలనే లక్ష్యంతో ఇలాంటి విద్యా, విజ్ఞాన,నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కి విద్యార్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈకార్యక్రమంలో భాగంగా రిమోట్ సెన్సింగ్ జియో స్పెషియల్ టెక్నాలజీ పై మెటుపల్లి(ఇబ్రహీంపట్నం)కు చెందిన తోగిటి ప్రేమ్ కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మెట్‌పల్లి వార్త

కాణిపాకం వాసవీ నిత్య అన్నదాన సత్రం ట్రస్ట్ ఉపాధ్యక్షుడిగా మైలారపు లింబాద్రి ప్రమాణ స్వీకారం

మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:



మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి కాణిపాకం శ్రీ స్వయంభూ వరసిద్ధి వినాయక క్షేత్రంలోని ఆర్య వైశ్య వాసవీ నిత్య అన్నదాన సత్రం ట్రస్ట్ ఉపాధ్యక్షుడిగా గురువారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు, ఆలయ అధికారులు నూతన బాధ్యతలు చేపట్టిన మైలారపు లింబాద్రికి అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు అందజేశారు. భక్తులకు నిత్య అన్నదాన సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు తనవంతు కృషి చేస్తానని మైలారపు లింబాద్రి తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు, ఆలయ అధికారులు, భక్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొని నూతన ఉపాధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా బంగారు పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం

మెట్ పల్లి కల్చరల్,ప్రభాత వార్త:

పట్టణంలోని బంగారు పెద్దమ్మ ఆలయంలో గురువారం 16వ వార్షికోత్సవం పురస్కరించుకొని బంగారు పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు పంచామృతాతో ప్రత్యే కఅభిషేకము హోమము నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున మహిళతో కుంకుమ పూజ కార్యక్రమం అనంతరం తీర్థప్రస్నాద అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు జక్కం బాబు యామా గణేష్ లోలకు సురేష్ తోకల గంగ నరసయ్య తోకల వెంకటేష్ జట్ట వేణి రమేష్ మారంపల్లి సాయిలు జక్కం శేఖర్ శివ ధర్మయ్య నరసయ్య భూమయ్య డాక్టర్ ఆనంద్ బాబు దంపతులు అర్జున్ తదితరులు నాయకులు భక్తులు పాల్గొన్నారు

విద్యార్థులకు నోటుబుక్స్, విద్యా సామగ్రి పంపిణీ

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :



ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్, బర్దిపూర్ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. మొత్తం 56 మంది విద్యార్థులకు ఈ విద్యా సామగ్రిని అందజేసి వారి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో యామాపూర్ సర్పంచ్ కనక నాగేష్, బర్దిపూర్ సర్పంచ్ సంగం అమృత, ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ పాల్గొని విద్యార్థులకు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన విద్యా సహాయాన్ని భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని తెలిపారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త

: అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో మెనూ ప్రకారం భోజనం పరిశుభ్రత, నిరంతర తనిఖీలు తదితర అంశాలపై జిల్లా విద్యాధికారి, మండల ప్రత్యేక అధికారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ట్రైబల్ వెల్ఫేర్ డీసీఓలు, ఈ ఎం ఆర్ ఎస్ ప్రిన్సిపాళ్ళు, వివిధ శాఖల అధికారులతో పంచాయతీరాజ్ టి జి ఈడబ్ల్యుఐడీసీ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయం లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తప్పనిసరిగా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని, దీనిని అన్ని గురుకులాల డీసీఓ లు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి రెసిడెన్షియల్ విద్యాలయం ఆవరణ, లోపల కిచెన్, డైనింగ్ హాల్ నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారులు, టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు తమకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం తనిఖీ చేయాలని దానికి సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు అందజేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లా అధికారికి ఒక విద్యాలయం కేటాయించామని, వారు విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్లు, ఫుడ్ ఇన్స్పెక్టర్, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తనిఖీ చేయాలని ఆదేశించారు.అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థుల హాజరు 100 శాతం ఉండేలా చూడాలని, ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రిన్సిపాళ్ళును ఆదేశించారు. కావాల్సిన వసతులు, యంత్రాల కోసం నివేదిక సిద్ధం చేసి ఆయా శాఖల ఉన్నతాధికారులకు పంపించాలని, పనులు జరిగేలా చూడాలని సూచించారు

ఆగిన భూభారతి గోస పడుతున్న రైతులు

15 రోజులనుండి నిలిచిపోయిన భూ రిజిస్ట్రేషన్లుతహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు

ముస్తాబాద్ ప్రభాత వార్త:

ముస్తాబాద్ మండల తహశీల్దార్ కార్యాలయములో భూ భారతి వెబ్సైట్ లు మొరాహించడముతో భూ రిజిస్ట్రేషన్ ల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందని బిఆర్ఎస్ పార్టీ యూత్ మండలాధ్యక్షులు శీలం స్వామి అన్నారు.గురువారం రిజిస్ట్రేషన్ ల కోసం తహసిల్దార్ కార్యాలయంలో విచ్చేసి రైతులతో కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా శీలం స్వామి మాట్లాడుతూ సాంకేతిక లోపాల కారణంగా సర్వర్లు భూముల క్రయవిక్రయాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయని దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,సైట్ రాకపోవడంతో రైతులు తీవ్ర నిరాశతో వెనుదిరు గు తున్నారు.కేసీఆర్ ప్రభుత్వములో ఉన్న ధరణి పేరును భూభారతీ అని నామకరణం చేసి రైతులను మోసం చేస్తున్నారని,రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిరోజు వేలాది సంఖ్యలో జరగాల్సిన లావాదేవీలు నిలోచిపోతున్నాయని,అప్పులు చేసి అత్యవసరంగా భూములు అమ్ముకున్నవారు రిజిస్ట్రేషన్ లు కాక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.సంభదింత అధికారులు,ప్రభుత్వం వెంటనే స్పందించి సాంకేతిక లోపాలను,సారి దిద్దాలని,ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమములో మండల రైతులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన షోరూంలో ఆర్టీఏ ఆకస్మిక తనిఖీలు

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ద్విచక్ర వాహన షోరూంలపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణంలోని ఖిఆరిఫ్ మోటార్స్ఖి (హీరో) ద్విచక్ర వాహన షోరూంలో జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) డి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా షోరూంలోని రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాల విక్రయాలు, ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఆర్టీఏ నిబంధనలను పక్కాగా అమలు చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. తనిఖీల్లో భాగంగా పలు సాంకేతిక, పరిపాలనాపరమైన లోపాలను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు నిబంధనలు పాటించని సంబంధిత షోరూం నిర్వాహకులకు నోటీసులు జారీ చేయనున్నట్లు డీటీఓ స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో జిల్లావ్యాప్తంగా ఉన్న ఇతర అన్ని వాహన షోరూంలలోనూ ఈ తరహా తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని రవాణా శాఖ అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

18 లోగా ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయాలి

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:

ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను ఈ నెల 18వ తేదీలోగా బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓ) అందజేయాలని సిరిసిల్ల ఆర్డీవో డాక్టర్ శ్రీధర్‌బాబు సూచించారు. గురువారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో ఓటర్ల నమోదు, సవరణలపై పలు వివరాలు వెల్లడించారు. చివరి నిమిషంలో ఫారాలు అందజేస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో సర్వర్లు బిజీగా ఉండి ఓటు గల్లంతయ్యే ప్రమాదం ఉందన్నారు. అలా ఓటు కోల్పోయిన వారు ఈ నెల 31న ముసాయిదా జాబితా వెలువడిన తర్వాత ఫారం6 ద్వారా కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్యూమరేషన్ పత్రం అందకపోతే ఎన్నికల సంఘం వెబ్‌సైట్ లేదా యాప్‌లో మీ బూత్ బీఎల్ఓ నంబరుకు ఫోన్ చేసి పత్రాన్ని పొందవచ్చని, బీఎల్ఓలు స్పందించకుంటే నియోజకవర్గ హెల్ప్‌లైన్ నంబరు (గోపికృష్ణ: 92902 91666) లేదా ఈఆర్వోకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్ఐఆర్2002లో ఓటు ఉన్నవారు ఉన్నవారు ఇక్కడ ఎన్యూమరేషన్ పత్రం నింపరాదని ఆర్డీవో స్పష్టం చేశారు.

ఓటరు నమోదులో పాల్గొన్న బిఆర్ఎస్ నేతలు



తంగళ్ళపల్లి,ప్రభాతవార్త.

తంగళ్లపల్లి మండల కేంద్రంలోని మార్కండేయ కమ్యూనిటీ హాల్లో ఓటర్లకు ఫారాలు నింపడంలో బిఆర్ఎస్ నేతలు సహాయ,సహకారాలు అందిస్తున్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గజబింకార్ రాజన్న,సిరిసిల్ల ఫ్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి,మాజీ సర్పంచ్ అంకారపు రవీందర్,సీనియర్ నాయకులు కందుకూరి రామా గౌడ్,తిరునహరి భానుమూర్తి, శ్రీనివాస్,పరికిపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు..

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త

: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో 78వ జాతీయ విద్యార్థి దినోత్సవం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా లో అంబేద్కర్ చౌరస్తాలో 78వ ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మారం సందీప్ ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు . జాతీయ వాదులను తయారు చేస్తూ జాతీయవాద సిద్ధాంతల కోసం జ్ఞానం శీలం ఏకత అని మూడు అంశాలతో ముందుకు సాగుతున్న ఒకే ఒక జాతీయ సంస్థ అఖిల్ భారత విద్యార్థి పరిషత్ అని అన్నారు . దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థ ఏబీవీపీ అని అన్నారు . ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కన్వీనర్ లోపల్లి రాజు, జిల్లా హాస్టల్ కన్వీనర్ పూజాం కార్తీక్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఫణి కిషోర్ , టౌన్ జాయింట్ సెక్రెటరీ రుద్రవీణ , ధనుష్ , ఉపాధ్యక్షులు శివ , కార్యకర్తలు మహేందర్ , రాజేష్ , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:

తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జూలై 10న (శుక్రవారం) తలపెట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి అంగిడి కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన సిరిసిల్లలో మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య దూరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి లోకిని మల్లేష్, నాయకులు వెల్ది రాజు, పసునూటి జగన్, తాళ్లపల్లి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల వార్త

జాతీయ విద్యార్థి దినోత్సవ వేడుకలు

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.మండల కేంద్రంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంద వంశీకృష్ణ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జెండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంద వంశీకృష్ణ మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అని 1949లో నలుగురు విద్యార్థులతో ప్రయాణమైన ఎబివిపి అన్ని యూనివర్సిటీలలో,కళాశాలలో సభ్యత్వం ఉన్నటువంటి ఏకైక విద్యార్థి సంఘం అన్నారు.ఈ కార్యక్రమంలో విష్ణు,హరీష్,శివమణి,అరుణ్,ఫయాజ్,అంకిత్,చందూ,చరణ్,తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు లింగన్నపేట విద్యార్థి ఎంపిక



గంభీరావుపేట, ప్రభాతవార్త

:రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గంభీరావుపేట మండలం లింగన్నపేట విద్యార్థి గురువారం ఎంపికయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతికి చెందిన లింగం హర్ష ప్రథమ స్థానంలో నిలిచారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన మిడిల్ డిస్టెన్స్ విభాగంలో యుఖి/16 1000 మీటర్స్ లో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల మెదక్ లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో హర్ష పాల్గొననున్నట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు దాని నరేష్ తెలిపారు. విద్యార్థి సాధించిన విజయాన్ని ప్రధానోపాధ్యాయులు సంటి గంగారం, ఉపాధ్యాయ బృందం అభినందించారు. జిల్లా ప్రతిష్ఠను మరింత పెంచాలని ఆకాంక్షించారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ.

.తంగళ్ళపల్లి,ప్రభాతవార్త.

.తంగళ్లపల్లి మండలం ఇంద్రనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని భరత్ నగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ నాయకులు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తూ లబ్ధిదారుల ఇంటి స్థలాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు.అనంతరం పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మునిగెల రాజు,సర్పంచ్ చిట్యాల దేవేంద్ర వెంకన్న,జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల భూపతి,జిల్లా ఫిషర్మెన్ ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్,సుద్దాల శ్రీనివాస్,యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ ఎట్ల తిరుపతి,రాజిరెడ్డి,చిలుక పెల్లి భాను,భరత్ నగర్ గ్రామ అధ్యక్షులు చిట్యాల నాగరాజు,ఉప సర్పంచ్ నాగరాజు,వినీష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫలితాల మెరుగుదలకు ఎఫ్ఎల్ఎన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



విద్యార్థుల ఫలితాల మెరుగుదలకు ఎఫ్ఎల్ఎన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలనీ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో గురువారం జిల్లా కేంద్రంలోని విరూపాక్షి గార్డెన్స్‌లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ ఎల్ ఎన్) కార్యక్రమంపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూజిల్లాలో విద్యార్థుల ఫలితాలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ ఎల్ ఎన్) అమలుపై నిర్వహించిన సమావేశంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పలు కీలక సూచనలు చేశారు. పదో తరగతి చదువుతున్న కొంతమంది విద్యార్థులు కూడా కనీస అభ్యాస సామర్థ్యాలను సాధించలేకపోతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రాథమిక స్థాయి నుంచే ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, గణితంలోని చతుర్విధ ప్రక్రియలపై సంపూర్ణ పట్టు కల్పించడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు.జిల్లాలోని ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలకు మాసవారీ లక్ష్యాలను నిర్దేశించి, ప్రతి నెలా వాటి పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఉత్తమ ప్రగతి సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులను ప్రతి నెలా అభినందించి ప్రోత్సహిస్తామని, తక్కువ ప్రగతి సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులతో నేరుగా సమావేశమై సమస్యలను గుర్తించి, అభ్యాస ఫలితాలు మెరుగుపడేలా ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు.రాష్ట్ర స్థాయిలో జగిత్యాల జిల్లా పీజీఐలో ద్వితీయ స్థానం సాధించడం గర్వకారణమని, అయితే గత విజయాలతో సంతృప్తి చెందకుండా ఫలితాలను మరింత మెరుగుపరచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి గ్రేడ్‌కు తగిన చదువు సామర్థ్యాలను సాధించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.సింగిల్ టీచర్ పాఠశాలలు, మల్టీగ్రేడ్ తరగతులు, తక్కువ హాజరు, బోధనా సామగ్రి వినియోగంలో లోపాలు, రెమెడియల్ టీచింగ్ అవసరం వంటి సవాళ్లను గుర్తించి వాటిని సమిష్టిగా అధిగమించాలని సూచించారు. ప్రతి నెల ఎఫ్ ఎల్ ఎన్ లక్ష్యాలు నిర్దేశించుకుని, పాఠ్యపుస్తకాలు, టీచర్ హ్యాండ్‌బుక్, విద్యార్థుల వర్క్‌బుక్ మధ్య సమన్వయంతో బోధన సాగించాలని తెలిపారు.బేస్‌లైన్, మిడ్‌లైన్, ఎండ్‌లైన్ అంచనాల ద్వారా విద్యార్థుల పురోగతిని నిరంతరం పరిశీలించి, అంచనాల ఫలితాలను కార్యాచరణ ప్రణాళికలుగా మార్చాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక రెమెడియల్ బోధన అందించాలని పేర్కొన్నారు.ఉపాధ్యాయులు నిరంతరం తమ బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, సాంప్రదాయ బోధనకు బదులుగా భావనాత్మక, సృజనాత్మక, కార్యకలాపాల ఆధారిత, విద్యార్థి కేంద్రిత బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి నెల ఉత్తమ ఉపాధ్యాయులు, ఉత్తమ పాఠశాలలు, వినూత్న బోధనా విధానాలను గుర్తించి విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు.పాఠశాల సముదాయాలను అకాడమిక్ లెర్నింగ్ కమ్యూనిటీలుగా అభివృద్ధి చేసి, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, అకాడమిక్ బృందాలు నిరంతర పర్యవేక్షణ, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.అలాగే, 100 శాతం లక్ష్యాలను సాధించిన పాఠశాలలను స్వయంగా సందర్శించి, ఆయా పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. విద్యార్థుల్లో కనీస అభ్యాస సామర్థ్యాల పెంపునకు ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతతో పనిచేయాలని, నాణ్యమైన బోధన ద్వారా జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి కె.రాము, ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్వీలు అభయ్ రాజ్, విజయ్, జయంత్, ప్రవీణ్, మహేష్, ఉమేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం రూరల్ మోరపల్లి గ్రామంలో సంకోజి దివ్యరాణి కిరణ్,గంగాధరి లక్ష్మీ గంగరాజుల నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య ముఖ్య అతిథులుగా హాజరై, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపి కానుకలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 4,500 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని, గ్రామాల్లోనూ అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు.పేదలు అప్పుల పాలు కాకుండా ప్రభుత్వం నిర్దేశించిన 600 చదరపు అడుగుల బేస్‌మెంట్,750 చదరపు అడుగుల లోపు స్లాబ్ నిబంధనల ప్రకారం ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు విడతల వారీగా బిల్లులు మంజూరవుతున్నాయని,త్వరలోనే నియోజకవర్గానికి అదనంగా మరో 2,000 ఇళ్లు రానున్నాయని వెల్లడించారు.ప్రభుత్వం ఇప్పటికే ఉచిత విద్యుత్,రైతు భరోసా,సన్న బియ్యం పథకాలను అమలు చేస్తోందని,త్వరలోనే ప్రతి ఇంటికీ ఖిఇందిరమ్మ ఆరోగ్య



బీమాఖి పథకాన్ని తీసుకురానున్నట్లు ప్రకటించారు.డబుల్ బెడ్‌రూమ్ నివాసాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ద్వారా మరిన్ని నిధులు మంజూరు చేయిస్తామని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్ట రాజేందర్,మాజీ సర్పంచ్ గంగారం,మాజీ ఎంపీటీసీ కర్నె భూమారెడ్డి,నాయకులుసదానందం,వెంకటేష్, జీ.రమేష్,బి.రమేష్, లింగారెడ్డి, గంగారావు,వార్డు సభ్యులు గణేష్,వేణు, రాజేశ్వర్ రావు,లక్ష్మణ్, వేణుగోపాల్,అజయ్,భాస్కర్,రాయికల్ మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రావు,రాయికల్ నాయకులు తంగెళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక..జిల్లా స్థాయి సమావేశానికి హాజరైన మండల సర్పంచులు

బీర్ పూర్ ప్రభాత వార్త



జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలం కు చెందిన ఆయా గ్రామల సర్పంచ్ లు జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీసెస్ కాంప్లెక్స్ (ఐడీఓసీ) వేదికగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై నిర్వహించిన జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సమావేశానికి సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు రాజగోపాల్ రావు నేతృత్వంలో మండల పరిధిలోని సర్పంచులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారనీ తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాజగోపాల్ రావు ప్రజాపాలన ప్రగతి ప్రణాళికఖి చర్చ లో భాగంగా వేదికపై మాట్లాడుతూ గ్రామాల్లో నూతన పాలక వర్గాలు, సర్పంచులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, నిధుల కొరత, మరియు పాలనాపరంగా ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన పూసగుచ్చినట్లు వివరించారు.సర్పంచుల పక్షాన నిలబడి, వారి సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల వద్ద ప్రస్తావిస్తూ, పరిష్కారం కోసం కృషి చేస్తున్న రాజగోపాల్ రావును తోటి సర్పంచులు అభినందించారు. సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఆయన బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, అందరి సమస్యలను గట్టిగా వినిపిస్తూ ఖిఅసలు సిసలైన సారథిఖిగా అందరి మన్ననలు పొందుతున్నారని పలువురు కొనియాడారు. ఈ సమావేశంలో జిల్లా ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, నూతన సర్పంచులు పాల్గొన్నారు.

జగిత్యాల వార్త

జగిత్యాల - కూకట్‌పల్లి మధ్య సూపర్ లగ్జరీ బస్సుల సేవలు ప్రారంభం

రోజుకు రెండు సర్వీసులు అందుబాటులోకి

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త: ప్రయాణికుల సౌకర్యార్థం జగిత్యాల నుంచి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి వరకు సూపర్ లగ్జరీ బస్సు సర్వీసులను ఆర్టీసీ ప్రారంభించింది. డిపో మేనేజర్ చేతుల మీదుగా గురువారం ఈ కొత్త సర్వీసులను ప్రారంభించారు. కొత్త షెడ్యూల్ ప్రకారం జగిత్యాల నుంచి ఉదయం 3:00 గంటలకు, మధ్యాహ్నం 3:00 గంటలకు సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరనున్నాయి.అలాగే కూకట్‌పల్లి నుంచి ఉదయం 9:00 గంటలకు, రాత్రి 9:30 గంటలకు జగిత్యాలకు బస్సు సర్వీసులు నడవనున్నాయి. ఈ కొత్త సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో డిపో మేనేజర్, సీఐ, ఎస్‌టీఐతో పాటు ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్షల మంది విద్యార్థులను జాతీయవాదులుగా తయారు చేస్తున్న సంస్థ ఏబీవీపీ

ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వినోద్ కుమార్

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త



ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కొత్త బస్టాండ్ నుండి స్వామి వివేకానంద మినీ స్టేడియం వరకు విద్యార్థులు ఏబీవీపీ జెండాను పట్టుకొని పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక స్వామి వివేకానంద స్టేషియంలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏబీవీపీ జెండాను రాష్ట్ర ఉపాధ్యక్షులు వినోద్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం కొద్దిమంది కార్యకర్తలతో 1949 జులై 9న ప్రారంభమైన ఏబీవీపీ గత 78 సంవత్సరాలలో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఎదిగిందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పని చేయడమే కాకుండా జాతీయ సమస్యల పై కూడా ఏబీవీపీ ఉద్యమాలు చేస్తూందన్నారు. వ్యక్తి నిర్మాణమే ధ్యేయంగా పనిచేస్తూ లక్షల మంది విద్యార్థులను జాతీయవాదులుగా తయారు చేస్తున్న సంస్థ ఏబీవీపీ అని అన్నారు. 89 లక్షల సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి ఉద్యమంగా ఏబీవీపీ పెరిగిందన్నారు. 78 సంవత్సరాల ప్రస్థానంలో జాతీయవాద సిద్ధాంతం కోసం ఎంతోమంది ఏబీవీపీ కార్యకర్తలు ఉగ్రవాదుల చేతల్లో అమరులయ్యారని తెలిపారు. అమరుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏబీపీ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు

అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:అర్హులైన ప్రతి ఒక్కరు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల పట్టణ అర్బన్ హౌసింగ్ కాలని లోమన్నె జ్యోతి లక్ష్మణ్ డబల్ బెడ్ రూమ్ ఇండ్ల లో గృహప్రవేశంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్.అనంతరం డబల్ బెడ్ రూమ్ కాలనిలో పారిశుధ్య పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్య ప్రణవ్ నాయకులు సమీండ్ల శ్రీనివాస్, ఏనుగుల రాజు అశోక్ ,స్వామి, విజయ రవి కుమార్ ,తదితరులు పాల్గొన్నారు.



పల్లెలే పట్టుకొమ్మలు...

సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కృషి చేయాలి

గ్రామాలపై పూర్తి అవగాహనతో సర్పంచులు పనిచేయాలి

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:



గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా సర్పంచులు, కార్యదర్శులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పిలుపునిచ్చారు. గ్రామాలను ఉత్తమ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు గ్రామాలపై పూర్తి స్థాయి అవగాహనతో పాటు దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు.గురువారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఖిప్రజా పాలన – ప్రగతి ప్రణాళికఖి గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ కె. అనిల్ కుమార్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీలు కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులపైనే ఆధారపడకుండా సొంత ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకునే దిశగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గ్రామాల ఆర్థిక స్వావలంబన పెరిగితేనే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న నిధులతో గ్రామాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద కొత్తగా ప్రవేశపెట్టిన వీబీజీ-రామ్ జీ పథకం ద్వారా 318 రకాల అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని సర్పంచులు, కార్యదర్శులు సమర్థంగా



వినియోగించుకుని గ్రామాల్లో మౌలిక వసతులు, ప్రజా సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు. పంచాయతీరాజ్ చట్టం, గ్రామపంచాయతీల విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, గ్రామపంచాయతీ ప్రొఫైల్ తయారీ, ఆదాయ వనరుల గుర్తింపు, రానున్న మూడు సంవత్సరాలకు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిబద్ధతతో పనిచేస్తే ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు.పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ కె. అనిల్ కుమార్ మాట్లాడుతూ, ఎన్ఆర్ఈజీఎస్ కింద అమలు చేస్తున్న వీబీజీ-రామ్ జి పథకం ద్వారా గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టవచ్చన్నారు. నిధులు రావనే అపోహలకు తావివ్వకుండా అందు బాటులో ఉన్న అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిధులతో పాటు గ్రామాల సొంత ఆదాయాన్ని పెంచుకునే చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ మాట్లాడుతూ, సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాల అభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దే అవకాశం ఉందని, సొంత ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు గ్రామపంచాయతీ ప్రొఫైల్ తయారీ, ఆదాయ వనరుల పెంపు, మూడేళ్ల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, వీబీజీ-రామ్ జీ పథకం కింద చేపట్టే అభివృద్ధి పనులపై సర్పంచులు, కార్యదర్శులకు విస్తృతంగా శిక్షణ అందించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ కే అనిల్ కుమార్, జెడ్పీ సీఈవో పవన్ కుమార్, డీఆర్‌డీఓ గీత, పంచాయతీరాజ్ డీఈ జనార్ధన్, మాస్టర్ ట్రైనర్లు, సర్పంచులు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన డిప్యూటీ కమిషనర్

పంచాయతీ కార్యదర్శి పనితీరుకు అభినందనలు

చిగురుమామిడి, ప్రభాతవార్త :

జిల్లాలో ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల జీ ఎస్ ఏ పి అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రత్యేక అధికారి కే అనిల్ కుమార్ పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ చిగురుమామిడి గ్రామ పంచాయతీని గురువారం రోజు ఉదయం 11 గంటలకు సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన 15వ ఆర్థిక సంఘం నిధుల ఖర్చులు, బిల్లులు పని ఫైళ్లనుమల్టీపర్పస్ వర్కర్స్ జీతాల రికార్డులను, ఈ పంచాయతీ పోర్టల్ పనితీరును, పన్ను వసూళ్ల తదితర వివరాలను పరిశీలించారు. పలు రికార్డులు తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ



కార్యాలయ పనితీరు బాగుందని పంచాయతీ కార్యదర్శి రమేష్ ను అభినందించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో డిఎల్పీఓ హరికిషన్, ఎంపీడీఓ రామ్మోహన్ చారి, ఎంపీఓ కిరణ్ కుమార్, సర్పంచ్ ఆకవరం భవాని, ఉప సర్పంచ్ కాశ బోయిన విజయలక్ష్మి , పంచాయతీ కార్యదర్శి కాల్వ రమేష్, మండల కంప్యూటర్ ఆపరేటర్లు, జిపి సిబ్బంది గొల్లపల్లి సత్యం పాల్గొన్నారు.

బిఆర్ఎస్ పార్టీని వీడబోతున్నాము

ఆదరణ, గుర్తింపు, గౌరవం లేకపోవడమే

పార్టీ కోసం పదహారేళ్లు కష్టపడ్డాం

చిగురుమామిడి, ప్రభాత వార్త : చిగురుమామిడి మండలంలో టిఆర్ఎస్ పార్టీకి గతంలో ఉన్న అభిమానం క్రేజ్ క్రమక్రమంగా తగ్గిపోవడానికి నాయకుల ప్రవర్తన తీరే కారణంగా తెలుస్తోంది. చిగురుమామిడి కంచుకోటగా పేరు ప్రఖ్యాతల్ని సంపాదించుకున్న టిఆర్ఎస్ పార్టీ క్రమంగా గ్రాఫ్ తగ్గుతూ వస్తుందని పార్టీ అభిమానులు చెబుతున్నారు. పార్టీలో సముచిత స్థానం కరువైందని కొద్ది మంది నాయకులు మాత్రమే టిఆర్ఎస్ పార్టీలో లబ్ధి పొందుతున్నారని, చక్రం తిప్పుతున్నారని అంటున్నారు. రేకొండ గ్రామానికి చెందిన తాటికొండ బ్రదర్స్ గత 16 సంవత్సరాల నుంచి పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారు. అయితే గత కొద్ది రోజుల నుంచి కారణాలు తెలియకుండానే తమను పార్టీ నాయకులు పక్కకు



పెట్టారని, సభలకు సమావేశాలకు సమాచారం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. తాము ఇక పార్టీలో ఇముడ లేమని ప్రభాత వార్త ద్వారా అంటున్నారు. పార్టీలో కనీసం ఆదరణ, గౌరవం,గుర్తింపు నాయకులు ఇవ్వడం లేదని తమని కావాలని టార్గెట్ చేస్తూ వస్తున్నారని అంటున్నారు. ఇది ఇలానే కొనసాగితే తాము మానసికంగా ఇబ్బంది పడవలసి వస్తుందనే కారణంతో పార్టీని బహిరంగంగా వీడబోతున్నట్లుగా చెబుతున్నారు. కేవలం ఒక్క లీడర్ ప్రవర్తన తీరు తమను పార్టీ వీడే విధంగా చేస్తుందని అంటున్నారు. ఇప్పటికే పార్టీని వీడి దూరంగా ఉన్న నాయకులను సైతం పిలిచి మాట్లాడే పరిస్థితి బిఆర్ఎస్ పార్టీలో కరువైందని అంటున్నారు. తాటికొండ బ్రదర్స్ ఏ పార్టీలో చేరడం పై ఇంకా స్పష్టత రావాల్సి ఉన్నది.

ప్రభుత్వ పాఠశాలలో రికార్డు స్థాయిలో విద్యార్థుల అడ్మిషన్లు

మానకొండూర్, ప్రభాతవార్త : కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు బోధిస్తున్న విద్యా కు, ప్రభుత్వం అందిస్తున్న మెరుగైన సౌకర్యాలకు తల్లిదండ్రులు ఆకర్షితులై తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తామంటూ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ల కోసం పోటుపడుతున్నారు. మానకొండూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత (బాలుర) పాఠశాలలో ఈ ఏడాది 202627 విద్యా సంవత్సరంగాను 133 మంది విద్యార్థులు నూతనంగా అడ్మిషన్లు పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ మానకొండూరు బాలుర ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో పాటు, మంచి విద్యా క్రమశిక్షణ ను అందిస్తున్నామని తెలిపారు. నేడు 305 మంది విద్యార్థులతో పాఠశాల కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎంతోమంది త్రిబుల్ ఐటీ బాసరలో సీటు పొంది ఉన్నత స్థాయికి ఎదగారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థుల కోసం చదువులో రాణిస్తున్న విద్యార్థులకు ఎన్.ఎం.ఎం.ఎస్ స్కాలర్‌షిప్ ను విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అంతేకాకుండా పాఠశాలల ఆవరణలోనే విద్యార్థుల కోసం వసతి గృహాన్ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే, మీ పిల్లలకి బంగారు భవిష్యత్తు నిచ్చే బాధ్యత మాదే అని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ హామీ ఇచ్చారు.



కరీంనగర్ వార్త

కదం తొక్కిన యువతరం.. నోటిఫికేషన్ కావాలంటూ ఆందోళన

20వేల ఉద్యోగాలకు డిమాండ్

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:



ఐదు వేల ఉద్యోగాల ప్రకటన రద్దు చేసి, ఇరవై వేలతో కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని సామాజిక కార్యకర్త కోట శ్యామ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్ తెలంగాణ చౌరస్తాలో ఉద్యోగార్థులతో కలిసి మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉద్యోగ క్యాలండర్ విడుదల చేయాలని కోరారు. నిరుద్యోగులకు మేలు జరిగేలా అభ్యర్థుల వయో పరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. కేవలం ఐదు వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులను గోసపెడుతున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఖాళీగా ఉన్న 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, లేదంటే దశల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం లేవనెత్తుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త బెల్లపు కరుణాకర్,అన్నమల్ల సురేష్, శ్రీకాంత్, బాలు, సాయి, పెద్ద ఎత్తున మహిళ అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ విద్యార్థినిలు టీసీఎస్ ఉద్యోగాలకు ఎంపిక

కరీంనగర్ రూరల్, ప్రభాతవార్త:



కరీంనగర్ ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ,పీజీ కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థినులు ప్రతిష్టాత్మక టీసీఎస్-2026 నియామకాల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియామక ప్రక్రియలో భాగంగా, జూన్ 19న హైదరాబాద్‌లో తుది ఇంటర్వ్యూలు నిర్వహించగా, కఠినమైన పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని దక్కించుకున్నారనీ కళాశాల కరస్పాండెంట్ వి. రవీందర్ రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తూ సన్మానించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్య శిక్షణ అందించడంతోనే ఈ విజయాలు సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థినుల కృషి, తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల అంకితభావం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టిఏఎస్ కే ప్రాంతీయ సమన్వయకర్త గంగాప్రసాద్ మాట్లాడుతూ, ఉపాధి అవకాశాల కల్పనలో ఆల్ఫోర్స్ కళాశాల చూపుతున్న చొరవను ప్రశంసించారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 27వ వార్డులో బిజెపి ఆధ్వర్యంలో హెల్ప్ లైన్

జమ్మికుంట/ హుజురాబాద్, ప్రభాతవార్త:

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని కృష్ణ కాలనీ లోని 27 వ వార్డులో బిఎల్ఏ 2 ద్వారా కొన్ని పోలింగ్ బూతులలో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, మున్సిపల్ కౌన్సిలర్ శీలం శ్రీనివాస్ లు పర్యటన చేస్తూ ప్రజలను నూతన ఓటరుగా ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని, గురువారం బిజెపి ఆధ్వర్యంలో హెల్ప్ లైన్ ఏర్పాటు. చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత ఓట్లు ఇక పని చేయవని 2002 ఆధారంగా అధికారులు మ్యాపింగ్ చేశారని అట్టి ఓటర్ లిస్ట్ ఆధారంగానే మనకు ఇచ్చిన ఫారాలను నింపి ఫోటో అంటిస్తేనే కొత్త ఓటు వస్తుందని, లేదంటే ఓటు రాదని ఈ సమాచారాన్ని అందరు గ్రహించాలని, అప్పుడే ప్రజాస్వామ్య పరిరక్షణకై మనందరం నడుము బిగించాలని బి.ఎల్.ఓ లు బి.ఎల్. ఎ.2 ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని వారు



అన్నారు. దొంగ ఓట్ల (ఇక్కడ లేనివారి) కోసం ప్రయత్నం చేస్తున్నారని అలాంటి వాటిని ముసాయిదా ఓటర్ లిస్టులో తొలిగిస్తామని అందుకోసం బిజెపి బిఎల్ఎ 2 పకడ్బందీగా పని చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కేశ స్వరూప, బి.ఎల్. ఎ 2 కనుబోయిన బద్రి, మహిళా మోర్చా అధ్యక్షురాలు చుక్కల గంగాభవాని, వెంకటరాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

జాతీయ పునర్నిర్మాణం ఏబీవీపీ లక్ష్యం

ఏబీవీపీ కో కన్వీనర్ గోస్కుల అజయ్...



జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త: జాతీయ పునర్నిర్మాణం ఏబీవీపీ లక్ష్యం అని ఏబీవీపీ కో కన్వీనర్ గోస్కుల అజయ్ అన్నారు.అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జమ్మికుంట నగర శాఖ ఆధ్వర్యంలో జూలై 9 జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా పట్టణంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎబివిపి కో కన్వీనర్ గోస్కుల అజయ్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకుందని 5 మంది విద్యార్థులతో ప్రారంభమై కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అటాక్ నుంచి కటక్ వరకు 78 లక్షల విద్యార్థుల సభ్యత్వం తో ప్రపంచములోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా నిలిచిందని తెలిపారు. ఎబివిపి నినాదాలు నేడు దేశానికి విధానాలుగా మారాయని, కాశ్మీర్ ఆర్టికల్ 360 రద్దు కై నినదించి ఉద్యమించి విజయం సాధించిన ఘనత ఎబివిపి దని, అక్రమ వలసదారుల ఏరివేతకు సేవ్ అస్సాం టుడే సేవ్ ఇండియా టుమారో అని అక్రమ వలసదారుల వల్ల ఏర్పడే జాతీయ భద్రత విషయంలో ఎబివిపి చేసిన ఉద్యమాలు నేడు ఈశాన్య రాష్ట్రాలు భారత్ తో బలంగా నిలుచుటకు ఆధారం అయిందని అన్నారు. తెలంగాణ, బెంగాల్, కేరళ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వామపక్ష విదేశీ కుట్రలను, నరహంతక నక్సలైట్ల తూటా లకు ఎదురించి, జాతీయ వాదాన్ని పెంపొందించటానికి భారత్ మాతాకి జై అంటూ అనేక మంది ఎబివిపి కార్యకర్తలు ప్రాణత్యాగాలు సైతం చేశారని, అటువంటి మహా వీరులు పుట్టిన గడ్డ తెలంగాణ అని తెలిపారు. జాతీయ వాదాన్ని దేశభక్తిని విద్యార్థులను తెలియచేయడంలో ఎబివిపి కార్యకర్తలు నిరంతరం పనిచేస్తూ వస్తున్నారు. నేడు ఇక్కడ కాగడా జండా పట్టుకొని భారత్ మాతాకి జై అని నినదిస్తున్న ఈ వేలాదిగా విచ్చేసిన విద్యార్థుల సంఖ్య వారి ఉచ్ఛాహం సాక్ష్యం అని వామపక్ష వాదుల వ్యక్తి నిర్మూల సిద్ధతం నేడు భారత పటంలో శాశ్వతంగా నిర్మూలింపబడిందని అన్నారు.జాతీయవాద వ్యక్తి నిర్మాణ సిద్ధాంతం పల్లె పల్లెలో ప్రతి ఇంటిలో విస్తరించిందని అన్నారు.భారత దేశంను ప్రపంచంలోనే విశ్వ గురువుగా నిలుపుటకు ఎబివిపి 78 సంవత్సరాలుగా చేస్తున్న ఈ ప్రయాణంలో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి నగర సంయుక్త కార్యదర్శి శశాంక్, ఆదిత్య,ఉపాధ్యక్షులు సోహిత్, అఫ్రిద్ పూర్వ కార్యకర్తలు తిరుపతిరెడ్డి , రమణారెడ్డి శరత్, సుధాకర్ , శ్రీనివాస్, గట్టు సాయిరాం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోరపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రీప్రైమరీ పాఠశాల ప్రారంబించిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

జమ్మికుంట/ హుజురాబాద్, ప్రభాతవార్త:

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని కోరపల్లి ప్రాథమిక పాఠశాలలో 2026-2027 విద్యా సంవత్సరం నుంచి తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన ప్రీప్రైమరీ పాఠశాలను జిల్లా పోలీస్ కమిషనర్ మహమ్మద్ గౌస్ ఆలం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపి గౌస్ ఆలం, ఎసిపి మాధవి, సీఐ శ్రీ రామకృష్ణ గౌడ్, మండల విద్యాధి కారిణి మంథని హేమలత, గ్రామ సర్పంచ్ మధుసూదన్, ప్రీప్రైమరీ తరగతి గదిని రిబ్బన్ కటింగ్ ద్వారా ప్రారంభించి, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం కరీంనగర్ సీపీ గౌష్ ఆలం, ఏసీపీ మాధవి, మండల విద్యాధికారిణి మంథని హేమలతలను శాలువాలు కప్పి, జ్ఞాపికగా మొక్కలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారిణి మంథని హేమలత ప్రీప్రైమరీ విద్యార్థులందరికి అక్షరాభ్యాసం చేయించి, చిన్నారుల విద్యకు బలమైన పునాది ప్రీప్రైమరీ విద్యేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ స్రవంతి,



పాఠశాల ప్రధానోపాధ్యాయులు దబ్బెట రవీందర్, సీనియర్ ఉపాధ్యాయులు గుడిమిల్ల బలరాం, సంగసాని కుమారి, ప్రీప్రైమరీ ఉపాధ్యాయురాలు షైనీ శైలజ, వి.వి. రేఖ లతో పాటు వార్డు సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

మడిపల్లిలో మహిళా సంఘ భవనానికి భూమి పూజ...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో గురువారం 10 లక్షల రూపాయల ఈజీఎస్ నిధులతో మంజూరైన మహిళా సంఘం భవనానికి గ్రామ సర్పంచ్ పసుల తిరుమలవెంకటేష్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళల సంక్షేమం కోసం మహిళా సంఘ భవన నిర్మాణం చేయడం జరుగుతుందని ఇది పూర్తయితే మహిళలు తమ సంఘాలకు సంబంధించిన కార్యక్రమాలను ఈ భవనంలో నిర్వహించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజిరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనాథ్, వార్డు సభ్యులు సాయిరాం, రాణి, సీఏలు పరమేశ్వరి, స్వప్న ల తో పాటు మహిళా సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





మొక్కలు నాటి.. సంరక్షించండి.. మున్సిపల్ చైర్మన్...

జమ్మికుంట/ హుజూరాబాద్, ప్రభాతవార్త:



కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణ పరిధిలోని ఆబాది జమ్మికుంటలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆబాదిలో ప్రతి ఇంటికి చుట్టుపక్కల చాలా కాలి ప్రదేశాలు ఉంటాయి కనుక ప్రతిఒక్కరు భాగస్వాములై వారి వారి ఇంటి ఆవరణంలో మొక్కలు నాటి సంరక్షించి అందరికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. మన ఇంటి చుట్టూ మొక్కలు నాటడం ద్వారా మన కుటుంబసభ్యులు ఆరోగ్యంగా ఉంటారని, చుట్టుపక్కల వారికి కూడా ఉపయోగపడేలా కూడా ఉంటుందని వర్షాలు సకాలంలో కురవాలన్న చెట్లు అవసరం అని తెలిపారు. ఈ కార్య క్రమంలో కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, కౌన్సిలర్స్ ఎగిత సుజాత అశోక్, మైస శిరీష రవి,గణేష్, భిక్షపతి వార్డు ప్రజలు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;



జమ్మికుంట పట్టణంలో గురువారం జరిగిన పలు వివాహ వేడుకలకు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.జమ్మికుంట పట్టణంలోని ఎన్పిఆర్ గార్డెన్ లో ఇల్లందకుంట దేవస్థానం ప్రధాన అర్చకులు శేషం రామాచార్య కుమారుడు సీతారామచార్యగాయత్రి వివాహానికి హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి హాజరై నూతన వదూవరులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిలి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కెళ్ళపల్లి రాజేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మండ శ్రీనివాస్, సర్పంచ్ మర్రి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, 9వ వార్డ్ కౌన్సిలర్ పొనగంటి రాము తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ పూర్ లో ఇందిరమ్మ గృహాల ప్రొసీడింగ్స్ పంపిణీ.

వీణవంక, ప్రభాత వార్త: వీణవంక మండలము నర్సింగ పూర్ గ్రామానికి చెందిన శివ రాత్రి యాదమ్మ,శ్రావణపెల్లి శ్వేత, రాచర్ల స్వప్న లకు రెండో విడత ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు ప్రభుత్వం నుండి గురువారం ప్రొసీడింగ్స్ రాగా గ్రామ సర్పంచ్ జడల రమేష్,కాంగ్రెస్ సీనియర్ నేత గంగాడి రాజిరెడ్డి,మండల యూత్ ఉపాధ్యక్షుడు పి.సతీష్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు రమ సమ్మిరెడ్డి,కండె మహేందర్,గ్రామ కార్యదర్శి సురేష్ ,వార్డ్ సభ్యులు,కాంగ్రెస్ నేతలు కలిసి లబ్ధి దారులకు గ్రామ పంచాయతీలో పత్రాలను అందజేశారు.

గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని, చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, మంజూరైన నిధులతో పూర్తయిన పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రతి





గ్రామ పంచాయతీ రాబోయే 3 సంవత్సరాల కాలానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ను రూపొందించుకోవాలని, ఇది కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి 125 రోజుల పని దినాలు కల్పించాలని ఆదేశించారు. ఇందిరమ్మ కమిటీ ప్రతిపాదించిన గృహాల అర్హుల జాబితాను గెజిటెడ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ధృవీకరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఈ ప్రక్రియలో మండల అభివృద్ధి అధికారులు సమన్వయ బాధ్యతలు చేపట్టి, తమ పరిధిలోని గెజిటెడ్ అధికారియోంకు గృహాల ధృవీకరణ బాధ్యతలను కేటాయించాలని, ధృవీకరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నరేందర్, జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాజేశ్వర్, సంబంధిత అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిరుపేదల సొంతింటి కల నిజం చేయడమే లక్ష్యం

పట్టణంలో 440 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు

పెద్దపల్లి, ప్రభాతవార్త:

నిరుపేదల సొంతింటి కల నిజం చేయడమే లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య స్పష్టం చేశారు. గురువారం వార్డు సందర్శనలో భాగంగా 16, 17వ వార్డులను మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్లు మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్యను శాలువాతో సన్మానించారు. అనంతరం వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతి నిరుపేదవాడి స్వంత ఇంటి కళ నిజం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,



ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సహకారంతో పెద్దపల్లి పట్టణంలో 36 వార్డులకు గాను 440 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయడం జరిగింది అని చెప్పారు. అందులో చందపల్లి 16, 17 వార్డులో ఇందిరమ్మ ఇండ్లు పూర్తి కావస్తున్నయని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే 16, 17 వార్డులో అన్ని వాడల్లో సిసి రోడ్లు, మురికికాలువలు పూర్తి అయినప్పటికీ ఇంక కొంత పనులు పెండింగ్ ఉన్నాయని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణా రావు చేతుల మీదుగా ఇటీవల 16, 17 వార్డుల అభివృద్ధికి గాను 1,85,00000 రూపాయలతో శిలాఫలకం ప్రారంభించుకోవడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ ప్రోగ్రాం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు నాంసాని శ్రీనివాస్, తోట ఫణీందర్ భూపతి, మాజీ కౌన్సిలర్ రాజాం మహంత, జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్, వార్డ్ ఆఫీసర్లు సురేష్, సాయిచరణ్, సానిటరీ ఇన్స్పెక్టర్ పులిపాక రాజు, జవాన్ అనిల్, ఎలక్ట్రిషన్ ఇంచార్జ్ గోడిశాల శ్రీనివాస్, ఎలక్ట్రిషన్ శ్రీకాంత్, వాటర్ సప్లై సిబ్బంది రాజు, మెప్మా ఆర్పీలు రమ, మహేశ్వరి, శ్రీలత, వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

60 రోజులకు మించి భూ భారతి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు

రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్

మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

60 రోజులకు మించి భూ భారతి దరఖాస్తులు పెండింగ్ లో ఉండొద్దని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ స్పష్టం చేశారు. భూముల రీ సర్వే, నక్ష భూముల అంశాలపై రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ, భూముల రీ సర్వేను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత పారదర్శకంగా నిర్వహించి ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వేను దశలవారీగా చేపడుతోందని, తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సర్వేతో ప్రతి సర్వే నంబర్ కు స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడంతో పాటు ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రీ సర్వే చేపట్టాలని ఆదేశించారు. రీసర్వే జరుగుతున్న ప్రతి



గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, ఆయా గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వాములను చేయాలని సూచించారు. రీ సర్వేలో రెగ్యులర్ సర్వేయర్లతో పాటు లైసెన్స్ డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సోమవారం నుంచి సర్వేయర్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందికి బ్యాచ్ ల వారీగా సమగ్ర శిక్షణ నిర్వహించి అనంతరం అన్ని గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమాలు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో కూడా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రీ సర్వే పూర్తయ్యే వరకు రెగ్యులర్ సర్వేయర్లలో 25 శాతం మందిని రొటేషన్ పద్ధతిలో విధుల్లో వినియోగించాలని తెలిపారు. లైసెన్స్ డ్ సర్వేయర్ల పనితీరును శాఖ సర్వేయర్లు నిరంతరం పర్యవేక్షించాలని, డివ్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో రీ సర్వే పనులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో రీ సర్వే నాణ్యతతో నిర్వహించాలని, సర్వేలో ఉపయోగించే ఆధునిక పరికరాల వినియోగాన్ని సాంకేతికంగా పర్యవేక్షించే వ్యవస్థ అందుబాటులో ఉందని, వాటిని సమర్థవంతంగా ఉపయోగించాలని సూచించారు. రీ సర్వేలో పాల్గొనే లైసెన్స్ డ్ సర్వేయర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం అందజేస్తుందని తెలిపారు. భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో అసాధారణ జాప్యం పై ఉన్నత న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, సాధారణ విధులు నిర్వహించడానికి కోర్టు ఆదేశాలు అవసరమా అని హైకోర్టు ప్రశ్నించిందని తెలిపారు. ప్రస్తుతం ప్రతి అధికారి వద్ద పెండింగ్ లో ఉన్న దరఖాస్తులపై హైకోర్టు వివరణ కోరుతోందని, స్పందించేందుకు 4 వారాల గడువు లభించిందన్నారు. రెవెన్యూ కార్యాలయంలోనూ భూ భారతి దరఖాస్తులు 60 రోజులకు మించి పెండింగ్ లో ఉండకూడదని, పెండింగ్ దరఖాస్తులను అత్యంత త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలో 2 కొత్త తహసీల్దార్ కార్యాలయ భవనాలకు పరిపాలనా అనుమతులు లభించాయని, ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, కలెక్టరేట్ పరిపాలనా అధికారి బి ప్రకాష్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసర్ సోమేశ్వర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెద్దపల్లి వార్త

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యాలయాల బంద్

పెద్దపల్లి, ప్రభాతవార్త:

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యాలయాల బంద్ ను జయప్రదం చేయాలని పిడిఎస్యు విజృంభణ పట్టణ కన్వీనర్ బి రామ్ చరణ్ కోరారు. గురువారం విద్యాలయాల, కళాశాలల బంద్ ను జయప్రదం చేయాలని పిడిఎస్యు విజృంభణ ఆధ్వర్యంలో పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్యు విజృంభణ పట్టణ కన్వీనర్ బి రామ్ చరణ్ మాట్లాడుతూ ఫీజు రియంబర్స్మెంట్ ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలన్నారు. విద్యను వ్యాపారంగా మారుస్తూ ప్రభుత్వాలు విద్యను కొనలేని సరుకుగా మార్చారని మండిపడ్డారు. నాణ్యమైన ఉచిత విద్యను అందించాల్సిన ప్రభుత్వాలు ప్రైవేట్ యాజమాన్యాల తొత్తులై ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు విద్యను అందకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా వ్యాపారం వల్ల ఏటేటా ప్రభుత్వ కళాశాలలు పాఠశాలలు మూసివేతలకు కుదింపులకు గురవుతున్నాయన్నారు. విద్య వ్యాపారం కాదు విద్య అందరికీ సమాన హక్కు కావాలన్నారు. విద్యారంగం సమస్యల పరిష్కారం కోసం జులై 10 న జరుగు పాఠశాలల కళాశాలల బంద్ కు రైతాంగం, కార్మిక వర్గం, ప్రజాస్వామికవాదులు మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ రాష్ట్ర నాయకులు ఈర్ల రామచందర్, పిడిఎస్యు విజృంభణ నాయకులు రవీందర్, అశోక్, సాగర్, విజయ్, పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సింగరేణి అభివృద్ధికి అండగా కేంద్ర ప్రభుత్వం



పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

సింగరేణి సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి తెలిపారు. తాడిచెర్ల బొగ్గు గనిని సింగరేణి సంస్థకు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం నేపథ్యంలో గురువారం హైదరాబాద్ లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డికి ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి తట్ట చెమ్మన్ బహుకరించి ఘన స్వాగతం పలికారు. ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన తాడిచెర్ల బొగ్గు గనిని సింగరేణికి కేటాయించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను గౌరవించిందని అన్నారు. ఈ 7 నిర్ణయం వల్ల సింగరేణి సంస్థ మరింత బలోపేతం కావడంతో పాటు వేలాది మంది కార్మికులకు ఉపాధి భద్రత, సంస్థ అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, దేశ ఇంధన భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే తాడిచెర్ల బొగ్గు గని సింగరేణికి కేటాయించడం సాధ్యమైందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్, ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ముకేశ్ గౌడ్, మాజీ పెద్దపల్లి బిజెపి జిల్లా అధ్యక్షులు చందుపట్ల సునీల్ రెడ్డి, దుర్గం అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందుగుల శ్రీనివాస్, పూనమ్ చంద్ పాల్గొన్నారు.

త్రిలింగ రాజరాజేశ్వరి ఆలయానికి తక్షణ మరమ్మతులు చేయాలి

గోదావరిఖని ,ప్రభాతవార్త:

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జనగామలో ఉన్న త్రిలింగ రాజరాజేశ్వరి ఆలయానికి తక్షణమే మరమ్మతులు చేపట్టి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తొడుపునూరి రమేశ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆలయాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో కేసీఆర్ కుటుంబం దోచుకుంది

పెద్దపల్లి, ప్రభాతవార్త:



కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో గత కేసీఆర్ ప్రభుత్వం లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసిందని, అంత ఖర్చు చేసినా రైతులకు సాగునీరందక ప్రయోజనం శూన్యంగా మారిందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్ లోని అసెంబ్లీ కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ (సీఎల్పీ) కార్యాలయంలో పెద్దపల్లి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టును లక్షా నాలుగు వేల కోట్లు పెట్టి నిర్మించినా రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని విమర్శించారు. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు ఇవ్వొచ్చునని హరీష్ రావు ఉత్తర తెలంగాణ రైతులను పూర్తిగా తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. బీఆరఎస్ హయాంలో నాలుగేళ్లలో కాళేశ్వరం నుంచి ఎత్తిపోసిన నీళ్లు 162 శతకోటి ఘనపుటడుగులు (టీఎంసీలు) మాత్రమేనని, అందులో 63 టీఎంసీలను తిరిగి నదిలోకి వదిలేశారని చెప్పారు. నికరంగా కాళేశ్వరం నుంచి ఎత్తిపోసింది కేవలం 74 టీఎంసీలు మాత్రమేనని, ఎల్లంపల్లి నీళ్లను కూడా కాళేశ్వరం నీళ్లుగా చూపించి మోసం చేశారనిధ్వజమెత్తారు. పెద్ద ఇంజనీర్ కేసీఆర్ అయితే, చిన్న ఇంజనీర్ గా హరీష్ రావు అవతారం ఎత్తారని, మానేరు గేట్లు ఎత్తితే ఆ నీళ్లు కూడా కాళేశ్వరం నీళ్లేనని ప్రచారం చేసుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రపంచంలోనే ఎనిమిదో వింతగా కాళేశ్వరం పేరు చెప్పి రైతులను వంచించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం బ్యారేజీలు పనికిరావని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎసఏ) నిదిక ఇచ్చిందని విజయరమణ రావు గుర్తు చేశారు. 2023 అక్టోబర్ లో మేడిగడ్డలో 19వ పిల్లర్ కుంగిపోతే, నవంబర్ 1న ఎన్డీఎసఏ నివేదిక ఇచ్చినా అప్పటి ప్రభుత్వం బయటకు రాకుండా కప్పిపెట్టిందని ఆరోపించారు. మేడిగడ్డ వైపు ఎవరినీ వెళ్లకుండా దాచిపెట్టే ప్రయత్నం చేశారని, రాష్ట్ర రైతులను మోసం చేసిన వాళ్లే ఇప్పుడు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. హరీష్ రావు రోజుకు వంద అబద్ధాలు చెప్పకపోతే నిద్రపోరని దుయ్యబట్టారు. గతంలో కన్నెపల్లి పంప్ హౌస్ మునిగిపోతే వందల కోట్లు ఖర్చు పెట్టి బాగు చేశారని, కానీ కనీసం లక్ష ఎకరాలు కూడా కాళేశ్వరం నీళ్లతో సాగు కాలేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం సర్వరోగ నిణి అని, కోటి ఎకరాల ఆయకట్టుకు నీళ్లు ఇస్తామని చెప్పుకున్న బీఆరఎస్ నాయకులు, ఏ నియోజకవర్గానికి ఎన్ని నీళ్లు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాలనే కాళేశ్వరం నీళ్లు ముద్దాడాయని, మిగతా ప్రాంతాలను గాలికొదిలేశారని విమర్శించారు. కాళేశ్వరం కోసం కేసీఆర్ తెచ్చిన అప్పులో తమ ప్రభుత్వం వచ్చాక 33,574 కోట్ల రూపాయలతో పాటు 417 కోట్ల రూపాయలను వడ్డీగా చెల్లించిందని, ఎత్తిపోసిన 74 టీఎంసీల నీళ్ల కోసం తొమ్మిది వేల కోట్ల రూపాయలను విద్యుత్ ఛార్జీల కింద కట్టామని వివరించారు. తమ ప్రభుత్వం తుమ్మిడిహట్టిని పూర్తి చేస్తుందని, గ్రావిటీ ద్వారా నీళ్లు తెచ్చి ఎల్లంపల్లిలో పోస్తామని, కాళేశ్వరంలో బ్యారేజీల రక్షణే తమ ఉద్దేశమని ప్రభుత్వ విప్ విజయరమణ రావు స్పష్టం చేశారు.

హర్ష హై స్కూల్‌లో ఘనంగా ప్లాంటేషన్ డే..

సుల్తానాబాద్, ప్రభాతవార్త:



పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని విద్యార్థుల్లో బలంగా నాటే లక్ష్యంతో కనుకుల హర్ష హై స్కూల్‌లో గురువారం ప్లాంటేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి వివిధ రకాల మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన విద్యావేత్త, ఉపాధ్యాయులు శంకరయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, అడవుల తగ్గుదల వంటి సమస్యలను ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, దానిని చెట్టుగా పెంచే బాధ్యత తీసుకోవాలని సూచించారు. మొక్కలను నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షిస్తేనే పర్యావరణ సమతుల్యత కాపాడబడుతుందని తెలిపారు. ప్రకృతిని పరిరక్షించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఉమా మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం పాఠశాల ప్రధాన లక్ష్యమని చెప్పారు. పాఠశాల డైరెక్టర్ ఎస్.కె. ఇక్బాల్ మాట్లాడుతూ విద్యతో పాటు సామాజిక బాధ్యతలను అలవర్చే కార్యక్రమాలకు పాఠశాల ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

కొండారెడ్డిపల్లె నుంచి కొండంత ఎత్తుకు

చొప్పదండి,ప్రభాతవార్త:



కొండారెడ్డి పల్లె చిన్న గ్రామం నుంచి మొదలైన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనమల రేవంత్ రెడ్డి ప్రస్థానం రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యేవరకు ప్రజల పక్షాన నిలుస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకుని నేడు 20 సంవత్సరాల రాజకీయ ప్రస్థానం ముగించుకున్న సందర్భంగా అసెంబ్లీ దళిత కమిటీ చైర్మన్, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో గడీల పాలన బద్దలు కొట్టి నేడు తెలంగాణలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజల మధ్య ఉంటూ ముందుకు సాగుతున్నారని సత్యం పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి లక్ష్యంగా, ప్రజలే ప్రాణంగా తలచి, ప్రజా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతూ ప్రజల మన్ననలు అందుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి భగవంతుడు అన్ని రకాల ఆత్మవిశ్వాసాన్ని అందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డీఎస్పీ ఎదుల్ల కిషోర్

పెద్దపల్లి, ప్రభాతవార్త:



రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ్య (సీతక్క)కు ములుగు జిల్లా క్రైమ్ డీఎస్పీ ఎదుల్ల కిషోర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ములుగు జిల్లా కేంద్రంలోని వారి నివాసంలో మంత్రి సీతక్కను ములుగు జిల్లా క్రైమ్ డీఎస్పీ ఎదుల్ల కిషోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి సీతక్క ఇలాంటి మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని భగవంతున్ని వేడుకున్నారు.

ఓటరు జాబితా సర్వేలో పారదర్శకత పాటించాలి....

సుల్తానాబాద్, ప్రభాతవార్త:

మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమాన్ని గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు కృష్ణ, ఎమ్మార్వో బషీర్ కలిసి పరిశీలించారు.పట్టణంలోని 3, 4, 5, 6, 8, 15 వార్డుల పరిధిలో వైశ్య భవన్, పద్మనాయక కళ్యాణ మండపం, దుబ్బలపల్లి పాఠశాల, ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఓటరు జాబితా సర్వే ప్రక్రియను పరిశీలించారు. బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనల ప్రకారం అనర్హులు, తప్పుడు ఓట్లను తొలగించాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని వారు పేర్కొన్నారు.

దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా అ ఖిల భారతీయ విద్యార్థి పరిషత్

పెద్దపల్లి, ప్రభాతవార్త:

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేశంలోనే అతిపెద్ద విద్యార్థి శక్తిగా అవతరించిందని, విద్యా రంగ సమస్యలపైనే కాకుండా జాతీయ భద్రతపై విద్యార్థులను చైతన్యపరుస్తోందని ఆ సంస్థ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అలివేలి రాజు తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జాతీయ విద్యార్థి దినోత్సవం, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ´ భారీ విద్యార్థి ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1949 జూలై 9న ప్రారంభమైన ఈ సంస్థ సుదీర్ఘ ప్రస్థానంలో జాతీయ చైతన్యాన్ని, విద్యా సంస్కరణలను నడిపించిందన్నారు. ముఖ్యంగా 1975 నాటి దేశ ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి విద్యార్థి పరిషత్ కార్యకర్తలు ప్రాణాలకు తెగించి పోరాడారని కొనియాడారు. నాడు వేలాది మందిని నిర్బంధించినా, జైళ్లకు పంపినా భయపడకుండా ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టారన్నారు. దేశ సమగ్రత విషయానికి వస్తే, ఈశాన్య రాష్ట్రాలను కలిపే వ్యూహాత్మక చికెన్ నెక్ ప్రాంత భద్రతపై, జాతీయ ఐక్యతపై విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించడంలో సంస్థ ముందుందని గుర్తు చేశారు.

చొప్పదండి వార్త



మీ అభిమానమే నాకు కొండంత అండ



చొప్పదండి,ప్రభాతవార్త:

కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజల అభిమానమే నాకు కొండంత అండ అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఈ మేరకు అసెంబ్లీ దళిత సంక్షేమ కమిటీ చైర్మన్ గా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నియామకం కావడంతో చొప్పదండి నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం నుంచి దళిత సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, ప్రజా ప్రభుత్వం అవకాశం ఇవ్వడాన్ని బాధ్యతగా తీసుకొని దళితుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండగట్టు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరితా శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య, కౌన్సిలర్ లు కొట్టే సునీత అశోక్, గుర్రం రాజేందర్ రెడ్డి, ముద్ద రాజేశ్వరి తిరుపతి, అర్నకొండ ఉపసర్పంచ్ జక్కుల అనిల్, శ్రీనివాస్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

.సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

చొప్పదండి,ప్రభాతవార్త:



రైతులకు జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ (ఎన్ ఎం ఎస్ ఎఫ్) పథకంలో భాగంగా గురువారం మల్లన్నపల్లి గ్రామంలో రైతులకు సేంద్రియ వ్యవసాయం లో జీవఎరువులు వివిధ రకాల కషాయం తయారీ విధానాలు ద్రవ జీవామృతం, ఘన జీవామృతం పురుగు నియంత్రణకు నీమాస్త్రం,అగ్నిఅస్త్రం, బ్రహ్మాస్త్రం తయారీ విధానాల గురించి, రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని తద్వారా నేల సారం పెరుగుతుందని రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. అలాగే క్షేత్ర ప్రదర్శన లో భాగంగా వరి నారు మడులను శాస్త్రవేత్త మధుకర్ రావు పరిశీలన చేశారు. మోగి పురుగు, సల్ఫేడ్ ప్రభావం గుర్తించి వాటి నివారోపణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా టి ఆర్ వి కె శాస్త్ర వేత్త మధుకర్ రావు, మండల వ్యవసాయ అధికారి మమత, ఎ ఇ ఒ లు కవిత, రమ్య జ్యోత్స్న, సంపత్, అధికారులు, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

చొప్పదండి,ప్రభాతవార్త:

ప్రతి ఒక్కరూ ఇంటింటా మొక్కలు నాటి, పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని చొప్పదండి మున్సిపల్ చైర్పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమాన్ని కమిషనర్ నాగరాజు తో పాటు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనగా క్రీడా మైదానంలో మొక్కలను నాటారు. చైర్ పర్సన్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని, అప్పుడే సస్య రక్షణ జరిగి పర్యావరణం పరిరక్షించబడుతుందని ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య, కౌన్సిలర్లు కొట్టే సునీత అశోక్, జిల్లా అర్చన శ్రవణ్ కుమార్, కనుమల్ల రాజశేఖర్, వడ్లూరు అనూష శ్యాంసుందర్, ఒలగొత్తుల సురేష్, కొత్త సుమలత గంగారెడ్డి, రాజన్నల రాజు, గుర్రం రాజేందర్ రెడ్డి, గుర్రం సుజిత్ రెడ్డి, ముద్దం రాజేశ్వరి తిరుపతి, పిట్టల వెంకటేష్, జిట్ట మంగ కుమార్, టి.ఎం.సి అనిత రెడ్డి, జూనియర్ సహాయకులు ఎన్నం అంజయ్య, శ్రీధర్ రెడ్డి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీవాణి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జగదాంబ దేవి, సేవలాల్ విగ్రహా ప్రతిష్టా వేడుకలు

హాజరైన బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జు చల్మెడ లక్ష్మీ నరసింహారావు

రుద్రంగి ప్రభాతవార్త :



రుద్రంగి మండల కేంద్రంలోని దాసరనాయక్ తండాలో జగదాంబ దేవి, సేవలాల్ నూతన విగ్రహా ప్రతిష్టా మహోత్సవ వేడుకలు గురువారంవైభవంగా నిర్వహించారు.విగ్రహా ప్రతిష్టామహోత్సవం సందర్భంగా నూతన ఆలయంలో గ్రామ స్తులు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వ హించారు. విగ్రహాప్రతిష్టా మహోత్సవానికి బీఆర్ఎస్ నాయకులతో కలిసి బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జు చల్మెడ లక్ష్మీ నరసిం హారావు హాజరై జగదాంబ దేవి, సేవలాల్నుదర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గిరిజన మహిళలు, నాయకులతో కలిసి నత్యాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జగదాంబ దేవి, సేవలాల్ఆశీస్సులు ఎల్లప్పుడు ప్రజలపై, గిరిజన బిడ్డలపై ఉండాలని



ఆక్షాంక్షించారు. జగదాంబ దేవి, సేవలాల్ ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా కూరవలని పాడిపంటలతో సంతోషంగా ఉండాలని వేడుకున్నాట్లు తెలిపారు. భక్తుల కోసం అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశామని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులుతెలిపారు. ఈకార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మాజీ ఎంపీపీ గంగం స్వరూపమహేష్, ఎంపీటీసీ మంచె రాజేశం లావణ్య, నాయకులు దయ్యాల కమలాకర్,చెప్యాల గణేష్, ఉప్పులూటి గణేష్, నాగులపల్లి రవి, కర్ణవత్తుల దేవేందర్, దయ్యాల నారాయణ, ఎనుగు రాజు, ఆకుల గంగాధర్, సింగారపు గంగారెడ్డి,సింగారపు గంగాధర్, లావుద్య మోహన్, దయ్యాల పెద్దులు, మణిదీప్, నరేష్, మల్లయ్యలతో పాటు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై ప్రభుత్వ విప్ దిగ్భ్రాంతి

- బాధితులకు పరామర్శ, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

వేములవాడ, ప్రభాతవార్త:

వేములవాడ అర్బన్ మండలం అనుపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బొలేరో, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో గాయపడి వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జిల్లా ఎస్పీ మహేష్ బిగితేతో కలిసి పరామర్శించారు. బాధితులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రమాద సమయంలో బొలేరో వాహనంలో కూలీలు ఉన్నారని, వారిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందన్నారు.



తీవ్రంగా గాయపడిన ఆ ఇద్దరిని మెరుగైన వైద్య చికిత్స కోసం వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. బాధితులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్

రుద్రంగి ప్రభాత వార్త :

రుద్రంగి మండల కేంద్రంలోని దసరా నాయక్ తండాలో శ్రీ జగదాంబ మేరమ్మ యాడి శ్రీ సంతు సేవలల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. తండా ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం గ్రామ పెద్దలు, నిర్వాహకులు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆది శ్రీనివాస్



మాట్లాడుతూ.. గిరిజనుల ఆధ్యాత్మిక సంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. తండాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తండా వాసులు పాల్గొన్నారు.

బట్టుపల్లి కిరాణా దుకాణంలో చోరీ కేసు ఛేదించిన మంథని పోలీసులు

ఇద్దరు హాబిచ్యువల్ నిందితుల అరెస్టు

నగదు చోరీ కేసులో రిమాండ్‌కు తరలింపు

మంథని ప్రభాతవార్త:పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని బట్టుపల్లి గ్రామంలో జరిగిన కిరాణా దుకాణం చోరీ కేసును మంథని పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు హాబిచ్యువల్ నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బట్టుపల్లి గ్రామానికి చెందిన బండెల స్వరూప (35), కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. జూలై 5వ తేదీ రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లగా, జూలై 6వ తేదీ ఉదయం షాపు తెరవడానికి వచ్చేసరికి గేటు, షాపు తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపల పరిశీలించగా కౌంటర్‌లో ఉంచిన రూ. 40 వేల వ్యక్తిగత నగదు, రూ. 10 వేల అమ్మకాల నగదు కలిపి మొత్తం రూ. 50 వేల నగదు దొంగిలించబడినట్లు గుర్తించి మంథని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దర్యాప్తులో భాగంగా గురువారం మంథని బస్ డిపో వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు



అనుమానాస్పదంగా సంచరిస్తూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. ఎస్ఐ ఎన్. సందీప్ కుమార్ నేతృత్వంలోని పోలీసు బృందం వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, బట్టుపల్లి చోరీ కేసుకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.అరెస్టయిన నిందితులు సుల్తానాబాద్ మండలం ఇంద్రానగర్‌కు చెందిన షేక్ అస్సర్ (22), రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన మీసా విష్ణు (26)గా గుర్తించారు. వారి వద్ద నుంచి కేసుకు సంబంధించిన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.పోలీసుల సమాచారం ప్రకారం, అరెస్టయిన ఇద్దరూ హాబిచ్యువల్ నేరస్తులు. వీరిపై గతంలో మంథని, సుల్తానాబాద్, పెద్దపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా పలు చోరీ కేసులు నమోదై ఉన్నట్లు వెల్లడించారు.

మాజీ మంత్రి రాజశేఖర గౌడ్ పరామర్శించిన మాజీ మార్కెట్ చైర్మన్ బాపురెడ్డి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

మాజీ సీనియర్ మంత్రి, తెలంగాణ రాష్ట్ర తొలి ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ గోడిశెల రాజేశం గౌడ్ ని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి, వారి కుమారుడు విజయేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఇటీవల మోకాలి మార్పిడి శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో వారు రాజేశం గౌడ్ నివాసానికి వెళ్లి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,రాజేశం గౌడ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని, ప్రజాసేవలో మరింత చురుకుగా కొనసాగాలని ఆకాంక్షి ంచారు.తనను పరామర్శించేందుకు వచ్చిన లోక బాపు రెడ్డి, విజయేందర్ రెడ్డిలను రాజేశం గౌడ్ ఆత్మీయంగా పలకరించి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వేములవాడ వార్త

బార్ అసోసియేషన్‌కు రూ.5లక్షల ప్రొసిడింగ్స్ అందజేత

వేములవాడ, ప్రభాతవార్త:



వేములవాడ బార్ అసోసియేషన్ బార్ హాల్ నిర్మాణం కోసం మంజూరైన రూ.5లక్షల ప్రొసిడింగ్స్ కాపీని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిట్టల మనోహర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బార్ హాల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయడానికి అదనంగా మరో 5లక్షల ఆర్థిక సహాయం అవసరమని బార్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వ విప్‌ను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ విప్ త్వరలోనే మరో రూ.5లక్షలు కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విప్ అందించిన సహకారానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

యూరియా కోసం ఇక క్యూ అవసరం లేదు..!

వ్యవసాయ అధికారిణి వినీత

వేములవాడ రూరల్ ప్రభాత వార్త



యూరియా కోసం రైతులు ఎరువుల దుకాణాల వద్ద వేచి ఉండాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ..ఫర్టిలైజర్ (యూరియా బుకింగ్) యాప్.. ద్వారా ముందస్తుగా బుకింగ్ చేసుకుని సులభంగా యూరియా పొందవచ్చని వేములవాడ రూరల్ మండల వ్యవసాయ అధికారిణి వినీత తెలిపారు. యాప్ ద్వారా బుకింగ్ విధానంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఆమె ప్రత్యేకంగా వివరించారు.రైతులు తమ మొబైల్ ఫోన్‌లో ఫర్టిలైజర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మొబైల్ నంబర్‌తో నమోదు చేసుకోవాలని, అనంతరం పట్టాదారు పాస్‌బుక్ వివరాలు, పంట విస్తీర్ణం నమోదు చేసి అవసరమైన మేరకు యూరియాను బుక్ చేసుకోవాలని సూచించారు. బుకింగ్ పూర్తయిన తర్వాత రైతుల మొబైల్‌కు ఎస్ఎంఎస్ లేదా యాప్ ద్వారా సమాచారం వస్తుందని, అందులో సూచించిన ఎరువుల విక్రయ కేంద్రానికి వెళ్లి యూరియాను తీసుకోవచ్చని తెలిపారు.బుకింగ్ అనంతరం నిర్దేశించిన గడువులోపు యూరియాను తీసుకోవాలని, లేకపోతే బుకింగ్ స్వయంచాలకంగా రద్దు అయ్యే అవకాశం ఉంటుందని వినీత హెచ్చరించారు. యూరియా పంపిణీలో పారదర్శకత తీసుకురావడం, రైతులకు సమయానికి ఎరువులు అందించడం, అనవసర రద్దీని నివారించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తోందన్నారు.యాప్ వినియోగంలో రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే సమీప వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో), మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. అవసరానికి అనుగుణంగా మాత్రమే యూరియాను బుక్ చేసుకోవాలని, ఈ సౌకర్యాన్ని ప్రతి రైతు వినియోగించుకోవాలని వేములవాడ రూరల్ మండల వ్యవసాయ అధికారిణి వినీత కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

రుద్రంగి ప్రభాత వార్త : రుద్రంగి మండల కేంద్రంలో ఎంవీఏ పవర్ ట్రాన్స్ పార్మర్ ఏర్పాటు కారణంగా శుక్రవారం రుద్రంగిలో విద్యుత్ సరఫరాలో అంతరాయంకలుగుతుందని ఎన్పీడీసీఎల్ ఏఈ శ్రీనివాస్ గురువారం ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్ పార్మర్ ఏర్పాటు కారణంగా శుక్రవారంఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ శ్రీనివాస్ కోరారు.

పెద్దపల్లి జిల్లా వాతావరణం ఆయిల్ పామ్ సాగుకు అత్యంత అనుకూలం

ముత్తారం, ప్రభాతవార్త:

పెద్దపల్లి జిల్లా వాతావరణం ఆయిల్ పామ్ సాగుకు అత్యంత అనుకూలమని భారతీయ ఆయిల్ పామ్ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె రామచంద్రుడు స్పష్టం చేశారు. ముత్తారం మండలంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ రైతుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం, క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ ఆయిల్ పామ్ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె రామచంద్రుడు మాట్లాడారు. భారతీయ ఆయిల్ పామ్ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె రామచంద్రుడు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా నాలుగో సంవత్సరం ఆయిల్ పామ్ తోటల నుంచి అధిక దిగుబడులు రావడం ఎంతో శుభపరిణామమని కొనియాడారు. ఇక్కడి క్లైమేట్ పరిస్థితులు ఈ సాగుకు చాలా



బాగున్నాయని, నాణ్యమైన దిగుబడి సాధించే అవకాశాలు మెండుగా ఉన్నందున జిల్లాలోని రైతాంగం ఎలాంటి సంకోచం లేకుండా ఆయిల్ పామ్ తోటల పెంపకానికి ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తరణకు అందిస్తున్న భారీ ప్రోత్సాహకాలను, రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకొని సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచాలన్నారు. సరైన పోషకాలు, నీటి పద్ధతులు, పురుగు తెగుళ్ల నివారణ పాటిస్తే స్థిరమైన భారీ ఆదాయం సొంతం చేసుకోవచ్చని భరోసా ఇచ్చారు. ఎండల వల్ల వచ్చే గెలల రాలడం వంటి సమస్యలపై క్షేత్రస్థాయి తోటల్లో పరిశీలన చేసి రైతులకు అవసరమైన సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యాం ప్రసాద్, తిరుమల ఆయిల్ కెమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కేశు కళ్యాకర్, ఉద్యాన అధికారి ఎ జ్యోతి, ఉద్యాన విస్తరణ అధికారి రాజశేఖర్, ఫీల్డ్ ఆఫీసర్లు అజయ్, రంజిత్, రైతులు సమ్మయ్య, బుచ్చం రావు, లింగారావు, రాజేశ్వరరావు, సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి అక్రమ పట్టాపై చర్యలు తీసుకోవాలి

మంథని ప్రభాతవార్త:

ప్రభుత్వ భూమిని అక్రమంగా తన పేరిట పట్టా చేయించుకుని బ్యాంకు రుణం పొందిన కోమలత పై తక్షణ చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త బొల్లంపల్లి సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శుక్రవారం మంథని ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన ఆయన, కోమలత ప్రభుత్వ స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. అదే భూమిని చూపించి బ్యాంకు నుండి రుణం కూడా తీసుకున్నారని తెలిపారు. రుణమాఫీ కూడా జరిగిందని రైతుబంధు పీఎం కిసాన్ ద్వారా లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. ముత్తారం మండలం ఖమ్మం పల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 618 / 41/1 లో 3 ఎకరాల 19 గుంటల అసైన్డ్ భూమి అక్రమంగా పట్టా చేయించుకున్నారని వాపోయారు. ప్రభుత్వ భూమి పేదలకు, ప్రజా అవసరాలకు ఉపయోగపడాలి. కానీ కొందరు అక్రమ మార్గాల్లో పట్టాలు చేయించుకుని స్వలాభం కోసం వాడుకుంటున్నారు. అక్రమంగా మంజూరైన పట్టాను రద్దు చేసి, ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదుపై సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తాం

రామగిరి ప్రభాతవార్త

సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్ల సాధనకై సిఎంఓఏఐ ఆర్జీ3 ఏపీఎ పరిధిలో జిఎం కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన గురువారం 11 రోజుకు చేరగా ఉధృతంగా కొనసాగుతు న్నాయి. సిఎంఓఏఐ ఆర్ జి త్రీ ఏరియా అధ్యక్షులు కోల శ్రీనివాస్ సెక్రటరీ ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధానంగా అధికారుల జీతాల అప్గ్రేషన్(పే అప్గ్రేడేషన్) ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని, జీతంలో భాగమైన పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్పీ) చెల్లింపులను ఆలస్యం చేయకుండా, తదితర అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఈ దీక్షను నిర్వహించామన్నారు. తమ న్యాయమైన సమస్యలు యజమాన్యం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఏపీ ఏ జిఎం కొలిపాక నాగేశ్వరరావు, ఏరియా ఇంజనీర్ ఉదయ్ భాస్కర్, రూప్ సింగ్, సివిల్ డీజీఎం రాజేంద్ర కుమార్, సింగరేణి అధికారులు అధిక సంఖ్యలో దీక్షకు తమ మద్దతు తెలిపారు. ఈ రిలే నిరాహార దీక్షలో కూర్చున్న అధికారులు అబ్దుల్ షబ్బీరుద్దిన్,అనంతుల శ్రీనివాస్,బండారి వంశీ కృష్ణ శ్రీరాముల వీరన్న , వల్లంపట్ల మోహన్, మాచర్ల రమేష్, బి .సూర్యప్రకా శ్, సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సి ఎం ఓ ల సమ్మె సంస్థకు కోట్ల నష్టం

రామగిరి ప్రభాతవార్త

సింగరేణి సీఎంఓ (దిలీవీ) అధికారుల సమ్మె కారణంగా సంస్థకు ప్రతిరోజూ కోట్ల రూపాయల ఆర్థిక నష్టం వాటిల్లడం అత్యంత ఆందోళనకరమని బీజేపీ జిల్లా నాయకుడు మొలుమూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత పది రోజులుగా సింగరేణిలోని అన్ని డివిజన్లలో సీఎంఓ అధికారులు రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం చేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివ రకు సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సీఎంఓ అధికారులతో చర్చలు జరిపి వారి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆలస్యం కొనసాగితే సింగరేణికి కలిగే నష్టానికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని హెచ్చరించారు.సింగరేణి పరిరక్షణ విషయంలో భారతీయ జనతా పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తోందని, తాడిచర్ల బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం అందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

అశోక్ కుమార్ మృతి సహకార రంగానికి తీరని లోటు

మంథని ప్రభాతవార్త:

మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శిగా విశిష్ట సేవలందించిన కే.శే. మామిడాల అశోక్ కుమార్ మృతి సహకార రంగానికి తీరని లోటని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. గురువారం మంథనిలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సంతాప సభలో మాట్లాడుతూ, అశోక్ కుమార్ రైతుల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేసి అందరి అభిమానాన్ని చురగొన్నారని పేర్కొన్నారు. 17 సంవత్సరాలుగా సహకార సంఘం లో విధులు నిర్వహిస్తున్నాడని, సంఘ కార్యదర్శిగా ఈ ప్రాంత రైతాంగానికి ఎన్నో సేవలు అందించారని అన్నారు. సంఘ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, రైతులు, పలువురు నాయకులు అశోక్ కుమార్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాష్ రెడ్డి, డైరెక్టర్లు ఆకుల రాజబాపు, రావికంటి సతీష్ కుమార్, లెక్కల కిషన్ రెడ్డి, ఉడుత మాధవి, దాసరి లక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్ ఎల్లంకి వంశీధర్, కెడిసిసి బ్యాంక్ మేనేజర్ కె.ఉదయశ్రీ, డిఈ సందేబోయిన శ్రీనివాస్, సింగిల్ విండో మాజీ చైర్మన్ ఎక్కటి అనంత రెడ్డి, నాయకులు గడ్డం పోషం, వేల్పుల గట్టయ్య, సంఘ సిబ్బంది దుబ్బాక సదాశివ్, బెజ్జంకి సదానంద్, నారమల్ల విద్యాసాగర్, బొద్దుల సమ్మయ్య, కొత్త స్వప్న, పైడాకుల రాకేశ్, గుడెల్లి మధుమోహన్, నారమల్ల చిన్నయ్య, మోతుకూరి సాగర్, రాగం అశోక్, పలువురు నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల వద్ద విద్యుత్ స్తంభాల ఏర్పాటు

రామగిరి ప్రభాతవార్త

రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో వ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు పలు వార్డుల్లో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు వేగంగా కొనసాగుతు న్నాయని, త్వరలోనే విద్యుత్ అధికారుల సహకారంతో విద్యుత్ సరఫరా అందేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణ రెడ్డి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని , విద్యుత్, తాగునీరు, రహదారులు వంటి ప్రాథమిక సౌకర్యాలను ప్రతి లబ్ధిదారునికి అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తూ, కల్వచర్ల గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

విద్యుత్ ప్రమాద బాధితునికి అండగా సిహెచ్ పి ఉద్యోగులు

రామగిరి ప్రభాతవార్త

రత్నాపూర్ గ్రామానికి చెందిన విద్యుత్ ప్రమాద బాధితుడు మెట్టు రవి కుటుంబానికి సి హెచ్ పి ఉద్యోగులు అండగా నిలిచారు.ఓ.సి.పి.1 సి.హెచ్.పి లో బొలెరో డ్రైవర్ గా పనిచేస్తున్న మెట్టు రవి డ్యూటీ తరువాత పార్ట్ టైమ్ పని కొరకు రత్నాపూర్ గ్రామ పంచాయతీ ఆదేశాల మేరకు గ్రామములో వీధి దీపాలను అమరస్తున్నా క్రమములో విద్యుత్తు షాక్ తగిలి పోల్ పైనుండి కింద పడి కరీంనగర్ ప్రైవేట్ హాస్పిటల్ చికిత్స పొందుతు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. సి.హెచ్.పి ఉద్యోగులందరూ తమకు తోచిన విధంగా డబ్బులు ఒక లక్ష రెండు వందల రూపాయలు వారి కుమారుడికి గురువారం అందజేశారు.ఈ కార్యక్రమంలో డివై జిఎం లు కాశీ విశ్వేశ్వరరావు, డివై ఎస్ ఇ గవ్వల శ్రీనివాస్, అనిల్ కుమార్, పిట్ సెక్రెటరీలు గంధం శ్రీనివాస్,కిషన్ నాయక్, డి లక్ష్మీపతి,రాజనర్సు, ఏ,రంగా వేణు, వెంకటేష్,కంప రమేష్, రాజేందర్, ప్రసాదరావు, లెక్కల రామకృష్ణ,మహిళ ఉద్యోగులు,సి.హెచ్.పి.ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

మంథని వార్త



కాంగ్రెస్ ప్రభుత్వంతో విద్యుత్ కష్టాలు

రైతాంగానికి 24 గంటల త్రీ ఫేస్ కరెంట్ ఇవ్వాలి

ముత్తారం, ప్రభాతవార్త:

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే రైతులకు విద్యుత్ కష్టాలు మొదలయ్యాయని ముత్తారం మాజీ ఎంపీపీ లక్కారం సర్పంచ్ అత్తే చంద్రమోళి ఒక ప్రకటనలో విమర్శించారు.ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో సాగు నీటి కోసం రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ బావులలో చాలి చాలని నీరు ఉందని, ఆ నీటితో పంటలు సాగు చేయాలన్నా కరెంట్ లేక రైతులు తీవ్ర అయోమయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి కేవలం 9 గంటల త్రీ ఫేస్ కరెంట్ మాత్రమే ఇస్తోందని, ఆ ఇచ్చే 9 గంటల విద్యుత్ సరఫరాలో కూడా గంటల కొద్దీ ట్రిప్పింగ్ సమస్యలు వస్తున్నాయని మండిపడ్డారు. గత ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని కాంక్షించి వ్యవసాయ రంగానికి 24 గంటల పాటు ఉచిత నాణ్యమైన కరెంట్ అందించిందని గుర్తు చేశారు. ఎండ తీవ్రతకు తోడు కరెంట్ కోతలతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి సాగును కాపాడటానికి రైతులకు 24 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలని, ముత్తారం మండలంలోని రైతులకు 24 గంటల త్రీ ఫేస్ కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాలేజీ లో అడ్మిషన్ల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలి

మంథని ప్రభాతవార్త:

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా ఇంటర్ విద్యాధికారిణి కల్పన అన్నారు. గురువారం మంథనిలోని బాలికల, బాలుర కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్పొరేట్ స్థాయిలో కళాశాలలో సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి పనులను చేపడుతున్నామన్నారు. గత సంవత్సరంలో చేపట్టిన అడ్మిషన్ల కన్నా ఎక్కువగా అడ్మిషన్లు అయ్యేలా చూడాలన్నారు. అధ్యాపకులు విద్యార్థుల సంఖ్యను పెంచేలా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు ఉంటేనే కళాశాలలు నిలబడతాయని, విద్యార్థుల సంఖ్య తగ్గకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థుల నోట్ బుక్స్ ను తనిఖీ చేశారు.కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్ళు బాలోజీ, ఉషా ఉన్నారు.

నేడు జనార్దన్ రెడ్డి 88వ జయంతి వేడుకలు

మంథని ప్రభాతవార్త:

దివంగనేత, ప్రముఖ రాజకీయా నాయకులు గీట్ల జనార్దన్ రెడ్డి 88 వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని మంథని విద్యార్థి యువత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండేల మారుతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుమారుగా 50 ఏళ్లుగా సామాజిక సేవారంగంలో విభిన్న సేవలు చేసినటువంటి గీట్ల జనార్దన్ రెడ్డి కృషి ఎనలేనిదని ఆయన గుర్తు చేశారు. శుక్రవారం ఆయన జయంతి వేడుకలలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని మారుతి కోరారు.

విశ్వకర్మ మహాసభ జిల్లా ఉపాధ్యక్షులుగా మంథని వాసులు

మంథని ప్రభాతవార్త:

అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ జిల్లా ఉపాధ్యక్షు లుగా మోధంపురం విజయకుమార్ ముల్కల రాజశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు నౌండ్ల సంతోష్ చారీ ఉత్తర్వులు జారీ చేశారు. అఖిల భారత విశ్వకర్మ మహాసభ జిల్లా ఉపాధ్యక్షులుగా ములుకల్ల రాజశేఖర్,మోదుంపురం. విజయకుమార్ లకు ఈ పదవులు దక్కినవి. రాజశేఖర్ ప్రభుత్వ ఉపాధ్యాయునిగా మంథని ఎస్టియు సంఘం అధ్యక్షుడిగా విధులు నిర్వహిస్తుండగా మోదంపురం విజయకుమార్ మంథని స్వర్ణకార సంఘం అధ్యక్షులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ విజయకుమార్ సమాజసేవలో భాగస్వామ్యం చేసినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

తప్పుడు ప్రచారాన్ని ఖండించిన ధూపదీప నైవేద్య అర్చకుల సమాఖ్య

గొల్లపల్లి, ప్రభాతవార్త:

ధూప దీప నైవేద్య రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ నాయకుడు గంగు ఉపేంద్రశర్మ ఖమ్మంలో చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ జగిత్యాల జిల్లా ధూపదీప నైవేద్య అర్చకుల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం గొల్లపల్లి మండల కేంద్రంలోని శ్రీ కళ్యాణ రామచంద్రస్వామి ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సమాఖ్య నాయకులు మాట్లాడుతూ, గంగు ఉపేంద్రశర్మ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి అర్చకులకు తప్పుడు సమాచారం చేరవేస్తున్న వాసుదేవ శర్మ తన చర్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో రథయాత్రలు, చైతన్యయాత్రలు, హోమాల పేరుతో అర్చకులను తప్పుదోవ పట్టించి మోసం చేశారని విమర్శించారు. ఇకనైనా అలాంటి చర్యలను విరమించి, ధూపదీప నైవేద్య అర్చకుల సంక్షేమానికి ఉపయోగపడే కార్యక్రమాలపై దృష్టి సారించాలని కోరారు.ధూపదీప నైవేద్య అర్చకులు ఐకమత్యంతో ముందుకు సాగితే తమ సమస్యలకు పరిష్కారం సాధించుకోవచ్చని వారు



పేర్కొన్నారు.ఈ సమావేశంలో ధూప దీప నైవేద్యం అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నాగరాజు మహేంద్రాచార్య, మాజీ అర్చక ఉద్యోగ వెల్ఫేర్ బోర్డు సభ్యుడు జక్కాపురం నారాయణస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు తిరునహరి సత్యనారాయణాచార్యులు, గొల్లపల్లి మండల అధ్యక్షుడు కూర్మాచలం సత్యనారాయణాచార్యులు, అర్చకులు గోవర్ధన్ అనిల్, గణేష్ శర్మ, అనుపురం శ్రీనివాస్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్‌ను
జయప్రదం చేయండి

జార్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేష్ పిలుపు

ముత్తారం, ప్రభాతవార్త:

రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నేడు చేపట్టే తెలంగాణ రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేష్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని విద్యావ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని విమర్శించారు. ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్, స్కాలర్‌షిప్ నిధులను తక్షణమే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిధులు సకాలంలో అందక వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే



పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతం కోసం బడ్జెట్ లో ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు.రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకుల కొరత వల్ల విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టడానికి రాష్ట్రంలో కఠినమైన ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మేధావులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా విద్యాసంస్థల బంద్ కు సహకరించి జయప్రదం చేయాలని కోరారు. విద్యాసంస్థల బంద్ తోనైనా ప్రభుత్వంలో కదలిక రావాలని, సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ భవన స్థలం పైన ముదిరిన వివాదం

ఎం.పీ.ఓ కు మాజీ మంత్రి జీవన్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకుల వినతి పత్రం

బీర్‌పూర్ ప్రభాత వార్త



జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం నరసింహులపల్లి గ్రామంలోని ప్రభుత్వ అంగన్‌వాడీ భవన అక్రమ కబ్జా ఉదంతం తీవ్ర రాజకీయ, సామాజిక ఉత్కంఠకు దారితీసింది. గురువారం నాడు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో, మండల స్థాయి బిఆర్ఎస్ నాయకులు మరియు నరసింహులపల్లి నాయకులు కలిసి బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ మధుసూదన్ కి రాతపూర్వక ఫిర్యాదు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి మీడియా ముఖంగా కబ్జా ఉదంతాన్ని, పోలీసుల ఏకపక్ష వైఖరిని ఎండగడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

ఎమ్మార్వో రిపోర్ట్ ఇచ్చినా చర్యలేవి?:

మాజీ మంత్రి జీవన్ రెడ్డివినతి పత్రం అందజేసిన అనంతరం మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ నరసింహులపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 22, ఇంటి నంబర్ 396 లో ప్రభుత్వ అంగన్‌వాడీ భవనం ఉన్నట్లు రెవెన్యూ డిపార్ట్మెంట్ వారు స్వయంగా సర్వే చేసి రికార్డుల ప్రకారం నివేదిక ఇచ్చారని గుర్తుచేశారు. “గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తు, పోస్ట్ ఆఫీస్ ఉద్యోగి అయిన సత్తయ్య ఈ ప్రభుత్వ భవనాన్ని అక్రమంగా కబ్జా చేశారన్నారు.

కలెక్టర్ ఆదేశాలను తక్షణమే అమలు చేయాలి

మొన్నటి ప్రజావాణి కార్యక్రమంలో నరసింహులపల్లి గ్రామస్తులంతా జిల్లా కలెక్టర్ కి ఈ కబ్జాపై ఫిర్యాదు చేయగా, కలెక్టర్ వెంటనే డీపీఓ ని పిలిచి అడగడం జరిగిందన్నారు. ఆ సమయంలో కచ్చితంగా ఈ అక్రమ కబ్జాను తొలగిస్తామని డీపీఓ కలెక్టర్‌కు మాట ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం డీపీఓ ఒక ట్రైనింగ్ మీటింగ్‌లో ఉండటం వల్ల, ఈ వ్యవహారాన్ని పరిశీలించడానికి ఎంపీఓ ని ఇక్కడికి పంపించారని పేర్కొన్నారు. ఎంపీఓ తక్షణమే స్పందించి కబ్జా తొలగింపు చర్యలు చేపట్టకపోతే, రాబోయే రోజుల్లో గ్రామస్తుల నిరసనలు ఏ స్థాయిలో ఉంటాయో చెప్పలేమని హెచ్చరించారు. తాము కేవలం కలెక్టర్ గారి ఆదేశాల మేరకే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయడానికి ఇక్కడికి వచ్చామని వివరించారు.

సర్పంచ్ భర్త ఇబ్బందులకు గురి చేస్తున్నాడు

అనుమతి లేకుండానే హద్దురాళ్ళను తొలగించాడు

భయభ్రాంతులకు గురి చేస్తున్న సర్పంచ్ భర్తపై ఫిర్యాదు

చిగురుమామిడి, ప్రభాత వార్త

చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామ సర్పంచ్ భర్త తన ఇష్టారాజ్యంగా తమ వ్యవసాయ భూమి హద్దుల్ని తొలగించారని, గ్రామం నుంచి వెలువడే డ్రైనేజ్ వాటర్ ని తమ వ్యవసాయ పొలంలోకి మళ్ళించారని ఆరోపిస్తూ చిగురుమామిడి మండల పరిషత్ అభివృద్ధి అధికారికి గురువారం రోజున ఫిర్యాదు చేసినట్లు బాధితుడు బెడిగం రమేష్ ప్రభాతవార్తకు తెలిపాడు. బాధితుడు మాట్లాడుతూ సర్పంచ్ భర్త సీసీ రోడ్డు పేరుతో తమ అనుమతి లేకుండానే తమకున్న వ్యవసాయ పొలం యొక్క హద్దులు జేసిబి సహాయం తో తొలగించాడని, అనంతరం గ్రామం నుండి వెలువడే డ్రైనేజి వాటర్ ను తమ పొలం లోకి మళ్లించాడని అన్నారు. ఇట్టి విషయం పై సర్పంచ్ భర్తను అడిగితే నువ్ ఏమి చేసుకుంటావో చేసుకో, ఇది గ్రామ పంచాయతీ పని అంటూ నిరక్ష ్యపూరితంగా మాట్లాడుతూ భయ భ్రాంతులకు గురిచేసినట్లు బాధితుడు ఎంపీడీఓ కు ఇచ్చిన ఫిర్యాదు లో పేర్కొన్నట్లు తెలిపాడు. సిమెంట్ రోడ్డు నిర్మాణం నిమిత్తం వ్యవసాయ పొలం హద్దులు చెరపకుండా డ్రైనేజీ కాలువ నిర్మాణం అనంతరమే సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ఇందుకు తాము కూడా గ్రామపంచాయతీ కి సహకరిస్తామని తెలిపాడు. డ్రైనేజి కాలువ నిర్మాణం అయ్యేంత వరకు సీసీ రోడ్డు పనులు ఆపాలని, తన తండ్రి ఇట్టి విషయం పై ఆందోళన చెంది గుండె పోటు రాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు బాధితుడు తెలిపాడు. గ్రామం లో ఇప్పటికే సర్పంచ్ భర్త గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండానే ప్రహరీ గోడల నిర్మాణాలు దగ్గరగా ఉండి చేయించారనే ఆరోపణలు ఉన్నాయని, ఇట్టి విషయం లో పంచాయతీ కార్యదర్శి తో బాటు, రిటైర్డ్ సూపరింటెండెంట్ ను కూడా బెదిరించినట్లు సమాచారం.



ధర్మపురి వార్త

ఏబీవీపి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ

ధర్మపురి,ప్రభాతవార్త



జాతీయ విద్యార్థి దినోత్సవంతో పాటు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 78 వార్షికోత్సవతం సందర్భంగా గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు ఏర్పాటుచేసిన ఎబీవీపి జెండాను జగిత్యాల జిల్లా కన్వీనర్ మడవేని సునీల్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949 లో స్థాపించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేశంలోని అతిపెద్ద విద్యార్థి సంస్థగా కొనసాగుతూ, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తుందని అన్నారు. అలాగే సమాజ సేవలో సైతం వాళ్లు పంచుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ బాధ్యులు శివ,మాధవ్,పిల్లి శ్రీనివాస్,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మడేలేశ్వరస్వామి బోనాలు

గొల్లపల్లి, ప్రభాతవార్త:



గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో రజకుల కులదైవమైన శ్రీ మాడేలేశ్వరస్వామికి గురువారం బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. డీజే చప్పుళ్లు, డప్పుల మోత, భక్తుల కోలాహలం మధ్య మహిళలు బోనాలు ఎత్తుకుని గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. యువతీయువకుల నృత్యాల నడుమ ఆలయానికి చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి కుటుంబాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు మతులాపురం రాయమల్లు, పెద్ద సాయిలు, వన్నెల దుబ్బయ్య, సాతాల్లా పోచయ్య, సాతాల్లా చంద్రయ్యతో పాటు రజక సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బోనాల పండుగలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్

జగిత్యాల టౌన్, ప్రభాతవార్త:

జగిత్యాల పట్టణంలోని 18వ వార్డులో శ్రీ మంజునాథ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆషాఢ మాస పోచమ్మ బోనాల పండుగ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి సమిండ్ల వాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. అమ్మవారి కృపతో జగిత్యాల పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో శ్రీ మంజునాథ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు మరియు కౌన్సిలర్ కూతురు శేఖర్, కౌన్సిలర్స్ కూతురు రాజేష్, ఏనుగుల లావణ్య రాజేందర్, మహిళలు, భక్తులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రామగుండం పవర్ హౌస్‌కు పునర్జన్మ

800 మెగావాట్ల సూపర్‌క్రిటికల్ ప్లాంట్ ఏర్పాటుకు వేగం

పాత 62.5 మెగావాట్ల యూనిట్ స్థానంలో భారీ విద్యుత్ కేంద్రం

టీజీ జెన్‌కో-సింగరేణి ఉమ్మడి భాగస్వామ్యానికి కేబినెట్ ఆమోదం

ఎన్‌టీపీసీతో కలిసి ప్రాజెక్టు అమలుపై రాష్ట్ర ప్రభుత్వ చర్చలు

ఉపాధి, పారిశ్రామికాభివృద్ధిపై స్థానికుల్లో భారీ ఆశలు

గోదావరిఖని ,ప్రభాతవార్త:



ఒకప్పుడు తెలంగాణ విద్యుత్ రంగానికి సేవలందించిన రామగుండం థర్మల్ పవర్ హౌస్ మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంటోంది. పాత 62.5 మెగావాట్ల ప్లాంట్ స్థానంలో అత్యాధునిక సాంకేతికతతో 800 మెగావాట్ల సూపర్‌క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. దాదాపు రూ.10,893 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు రాష్ట్ర విద్యుత్ భద్రతతో పాటు రామగుండం పారిశ్రామిక ప్రగతికి కొత్త ఊపునివ్వనుందని అధికారులు భావిస్తున్నారు.

ఐదు దశాబ్దాల సేవల తర్వాత మూత

అమెరికా సహాయంతో 1971 అక్టోబర్‌లో నిర్మితమైన రామగుండం థర్మల్ పవర్ హౌస్ 62.5 మెగావాట్ల సామర్థంతో ఎన్నో సంవత్సరాలు రాష్ట్రానికి విద్యుత్‌ను అందించింది. అప్పటి సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించిన ఈ కేంద్రం విశేష సేవలు అందించినప్పటికీ, కాలక్రమేణా పాతబడిపోయింది. కేంద్ర విద్యుత్ అథారిటీ మార్గదర్శకాల ప్రకారం చిన్న సామర్థం, అధిక కాలుష్యం కలిగిన పాత థర్మల్ యూనిట్లను దశలవారీగా నిలిపివేయాలని నిర్ణయించడంతో ఈ ప్లాంట్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీంతో ఆ ప్రదేశాన్ని ఆధునిక విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనకు రూపుదిద్దుకుంది.

రూ.10,893 కోట్లతో ఆధునిక ప్రాజెక్టు

పాత ప్లాంట్ స్థానంలో 1.800 మెగావాట్ల సూపర్‌క్రిటికల్ యూనిట్‌ను నిర్మించేందుకు టీజీ జెన్‌కో సమగ్ర ప్రణాళిక రూపొందించింది. ప్రాజెక్టుకు సంబంధించిన డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌కు ఇప్పటికే బోర్డు ఆమోదం లభించింది. ప్రభుత్వ పరిపాలనా అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించి నాలుగేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ విద్యుత్ కేంద్రానికి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గంటకు 2,365 క్యూబిక్ మీటర్ల నీటిని వినియోగించనున్నారు. సంవత్సరానికి సుమారు 3.053 మిలియన్ టన్నుల బొగ్గు అవసరమవుతుందని అంచనా వేశారు. సూపర్‌క్రిటికల్ సాంకేతికత కారణంగా బొగ్గు వినియోగం తగ్గడంతో పాటు విద్యుత్ ఉత్పత్తి సామర్థం పెరగడం, కాలుష్య ఉద్గారాలు కూడా నియంత్రణలో ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

సింగరేణి-టీజీ జెన్‌కో భాగస్వామ్యంతో ముందుకు

ప్రాజెక్టును తొలుత పూర్తిగా సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం, అనంతరం టీజీ జెన్‌కో-సింగరేణి ఉమ్మడి భాగస్వామ్యంతో అమలు చేయాలని నిర్ణయించింది. దీనికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇదే సమయంలో పాత ఖిబిఖి పవర్ హౌస్‌కు చెందిన సుమారు 500 ఎకరాల భూమి, ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలను వినియోగిస్తూ ఎన్‌టీపీసీతో కలిసి ప్రాజెక్టును అభివృద్ధి చేసే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నారు. రాష్ట్ర ఇంధన శాఖ ఉన్నతాధికారులు, టీజీ జెన్‌కో ప్రతినిధులు మూసివేసిన ప్లాంట్‌ను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించారు. ఎన్‌టీపీసీ అధికారులతో ప్రాథమిక స్థాయి చర్చలు కూడా జరిగినట్లు సమాచారం.

రామగుండం అభివృద్ధికి కొత్త ఆశలు

2030 నాటికి తెలంగాణలో విద్యుత్ అవసరాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా సౌర విద్యుత్ ఉత్పత్తి లేని సమయాల్లో గ్రిడ్‌కు నిరంతర విద్యుత్ అందించడంలో ఈ 800 మెగావాట్ల కేంద్రం కీలక పాత్ర పోషించనుంది. మరోవైపు నిర్మాణ దశలో వేలాది మందికి, ప్లాంట్ ప్రారంభమైన తర్వాత వందలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించే అవకాశముంది. రవాణా, నిర్మాణం, సేవా రంగాల్లోనూ ఆర్థిక కార్యకలాపాలు పెరిగి రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి కొత్త ఊపు వస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పరిపాలనా అనుమతులు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభమైతే, తెలంగాణ విద్యుత్ రంగ చరిత్రలో రామగుండం ఖిబిఖి పవర్ హౌస్ మరోసారి కీలక కేంద్రంగా అవతరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రోగులకు సకాలంలో ఖచ్చితమైన పరీక్షా ఫలితాలు అందించాలి

పెద్దపల్లి టి హబ్ కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర ఆకస్మిక తనిఖీ

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:



ప్రజలకు సకాలంలో, ఖచ్చితమైన వైద్య పరీక్షా ఫలితాలు అందేలా ల్యాబ్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వై పవిత్ర ఆదేశించారు. గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని టి హబ్ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా టి హబ్ కేంద్రంలోని అన్ని ల్యాబ్ గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ రోగులకు అందుతున్న సేవలు, వైద్య పరికరాల వినియోగం, ల్యాబ్ పరిశుభ్రత, రోజువారీ నిర్వహణ విధానాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ల్యాబ్‌లలో విధులు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర సిబ్బందితో నేరుగా మాట్లాడి వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. సేవల నాణ్యత, విధుల్లో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ల్యాబ్‌లలో పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, పరికరాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ల్యాబ్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టి హబ్ సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

భూముల రీ సర్వేను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత పారదర్శకంగా నిర్వహించి ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.భూముల రీ సర్వే, నక్ష భూముల అంశాలపై రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగిత్యాల సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వేను దశలవారీగా చేపడుతోందని తెలిపారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సర్వేతో ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడంతో పాటు ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయించనున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ, గత రెండు నెలలుగా భూ భారతి వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు, బఫరింగ్ సమస్యలు ఎదురవుతున్నాయని కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కరించిన అనేక దరఖాస్తులను కూడా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేని పరిస్థితి నెలకొందని, ఈ సాంకేతిక సమస్యలు పరిష్కారమైతే పెద్ద సంఖ్యలో పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించగలమని తెలిపారు.జిల్లాలో భూధార్ ప్రాజెక్టు కింద ఎంపికైన 70 గ్రామాల్లో ఇప్పటివరకు 5 గ్రామసభలు నిర్వహించామని, మరో 65 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రతి రోజు రెండు గ్రామసభలు నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఏడి (ల్యాండ్ సర్వే)కు ఆదేశాలు జారీ చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత, ఏడి (ల్యాండ్ సర్వే) కృష్ణ ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



విపత్తుల సమయంలో ఎస్డీఆర్ఎఫ్ కీలకం

ఎప్పుడైనా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

విపత్తుల సమయంలో స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్ డీ ఆర్ ఎఫ్) అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్ లోని 17 వ బెటాలియన్ లో స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్ డీ ఆర్ ఎఫ్) ఆధ్వర్యంలో విపత్తులు, వరదలు వచ్చే సమయంలో ఉపయోగించే యంత్రాలు, పరికరాల ప్రదర్శన గురువారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధితులను గుర్తించే కెమెరా, రిమోట్ కంట్రోల్ లైఫ్ బోయ్ (ప్రాణరక్షక తేలియాడే పరికరం), తనిఖీ రంధ్రం చేసే పరికరం, ఎత్తైన వెలుతురు స్తంభం (లైట్ మాస్ట్), రక్షణ కార్యక్రమాల కోసం ఉపయోగించే రోటరీ కట్టింగ్ యంత్రం, గాలి ద్వారా బరువులను ఎత్తే లిఫ్టింగ్ బ్యాగ్, పీపీసీ రక్షణ దుస్తులు, హైడ్రాలిక్ స్ప్రెడర్ కట్టర్ (లోహాన్ని విప్పే, కత్తిరించే పరికరం) ప్రదర్శన లో పెట్టగా, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులతో కలిసి పరిశీలించారు. ఒక్కో యంత్రం పనితీరు, వాటిని ఉపయోగించే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు రిజర్వాయర్లు ఎగువ మానేరు, మధ్య మానేరు, అన్నపూర్ణ, మల్కపేట ఉన్నాయని తెలిపారు. వర్షాకాలంతో పాటు సెప్టెంబర్, అక్టోబర్ నెలలో భారీ వరదలు వచ్చే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్ డీ ఆర్ ఎఫ్ బృందం శిక్షణ లో నేర్చుకున్న అంశాలు విపత్తులు సంభవించినప్పుడు తక్షణమే వినియోగించాల్సి వస్తుందని తెలిపారు.అప్పుడు ప్రతి నిమిషం విలువైందని స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్, ఎస్డీఆర్ఎఫ్ అధికారులు ఒక టీమ్ గా సమాచారం చేరవేస్తూ వరదలు వచ్చినప్పుడు సమన్వయంతో సేవలు అందించాలని ఆదేశించారు. గత ఏడాది వరదలు వచ్చినప్పుడు వివిధ జిల్లాల్లో ఉత్తమ సేవలు అందించిన ఎస్డీఆర్ఎఫ్ బృందం, ఇతర అధికారులను అభినందించారు. ఎప్పుడైనా సేవలు అందించేందుకు సిద్ధంగా



ఉండాలని పిలుపు నిచ్చారు.అనంతరం ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ వర్షాలు వస్తే సేవలు అందించేందుకు ఎప్పుడైనా సిద్ధంగా ఉండాలని సూచించారు. గత ఏడాది వరదలు సంభవించి ఇబ్బంది పడిన చోట్ల అధికారులు పరిశీలించి, ఇంకా కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. విపత్తులు సంభవించినప్పుడు వాడే పరికరాలు, యంత్రాలతో మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు. ఇంకా ఏమైనా యంత్రాలు, పరికరాలు కావాల్సి ఉంటే ముందస్తుగా తెప్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కమాండెంట్ పీ జె.పి.సి. ఛటర్జీ, అడిషనల్ కమాండెంట్ ఎంఐ సురేష్,అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటేశ్వర్లు , ఎస్డీఆర్ఎఫ్ ఆర్ఐ బండి శ్రీనివాస్, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.